Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 208 పేజీలు 8 వెల : 5 మంగళవారం 03 మార్చి 2026

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో
మరో సంచలనం

వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ఉత్తేజిత తెలుగు దినపత్రికకు మరియు UV9 కేబుల్ Tv చానల్ కు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ల నందు పనిచేయుటకు జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు నియోకవర్గాల వారిగా ఆర్.సి.ఇన్‌చార్జిలు మండలాల వారిగా విలేకరులు కావలెను

ఉత్తేజిత దినపత్రిక UV9

Contact : 94401 40418, 63038 17489





# అమెరికా దాడుల్లో ఖమేనీ మృతి

- యుద్ధం తొలి రోజే ఇరాన్ సుప్రీం నేత మరణం
- 40 మంది అత్యున్నత సైనికాధికారులు కూడా
- ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ భీకర ప్రతీకార దాడులు
- విమానాశ్రయాలు, బుర్జ్ ఖలీఫా సహా పలు భవనాలకు నష్టం
- ఆయా దేశాల్లో పలువురి మరణం.. గాయాలు
- నిలిచిపోయిన విమానాలు.. చిక్కుకుపోయిన వేల మంది
- ఇరాన్ దాడి చేసిన నౌకలో భారతీయులు

అమెరికా యుద్ధ నౌకపై క్షిపణులు పేల్చామన్న ఐఆర్‌జీసీ
ఖమేనీ వారసుడి ఎన్నిక నేడో రేపో.. హత్యపై
ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల నిరసనలు దుబాయ్

**ఇప్పటిదాకా మృతులు, గాయపడినవారు**

| దేశం | మృతులు | గాయపడినవారు |
|---|---|---|
| ఇరాన్ | 201 | 747 |
| ఇజ్రాయెల్ | 10 | 120 |
| అమెరికా | 3 | 5 |
| ఇరాక్ | 2 | 5 |
| కువైట్ | 1 | 32 |
| బహ్రెయిన్ | - | 4 |
| ఖతార్ | - | 16 |
| యూఏఈ | 3 | 58 |
| ఒమన్ | - | 5 |

ఇజ్రాయెల్, గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై శనివారం రాత్రి ఇరాన్ విరుచుకుపడింది. బహ్రెయిన్, కువైట్, ఖతార్‌లలోని స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. డజన్లకొద్దీ క్షిపణులను, వందలకొద్దీ డ్రోన్లను ఇరాన్ ప్రయోగించిందని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది.

-2లో



# ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవాలి

ప్రభుత్వ సేవల్లో లోపం రాకుండా చూడాలి

బాణాసంచా ప్రమాదంపై శివకాశికి వెళ్లి స్టడీ

అధికారులకు సిఎం చంద్రబాబు సూచన

అమరావతి:ప్రభుత్వ సేవలపై ప్రజలు సంపూర్ణంగా సంతృప్తి చెందాల్సిందేనని, అధికారులు ఆ మేరకు కృషి చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అధికారుల తీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని తేల్చిచెప్పారు. ఈ నెల నుంచి కనీసం 80 శాతం నుంచి 90 శాతం తగ్గకుండా పబ్లిక్ పర్సెప్షన్ ఉండాలని స్పష్టం చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పాలనలో 'పబ్లిక్ పర్సెప్షన్' కు అధిక ప్రాధాన్యతని స్తున్నారు. సోమవారం ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్‌పై క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ..'పెన్షన్ల పంపిణీలో లోటుపాట్లు తలెత్తుతున్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆర్టీసీ బస్సు సర్వీసులు బావున్నా.. ఆర్టీసీ బస్ స్టేషన్‌లో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సర్వీసులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలి. రాష్ట్రంలో వరుస ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలి. బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై అధికారులు శివకాశీకి వెళ్లి అధ్యయనం చేసిరావాలన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, డిజిటల్ సేవలు, సిబ్బంది పనితీరు బాగుంది.

అవినీతికి తావులేకుండా

రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిజాయితీ కలిగిన అధికారులకే అవకాశం ఇవ్వాలి. వాట్సప్ మనమిత్ర సేవలు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి, నూటికి నూరు శాతం వాట్సప్ సేవల వినియోగం జరగాలి. అన్ని శాఖల పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని అన్నారు.



## రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు

దర్యాప్తు అధికారి ముందు హాజరు కండి

బీహార్ కేడర్ ఐపిఎస్ నాయక్‌కు హైకోర్టు ఆదేశం

2లో..



## రైతులకు ప్రభుత్వం శుభవార్త

పెండింగ్ విద్యుత్ కనుక్షన్లకు ఆమోదం

2లో..

గల్ఫ్‌లో చిక్కుకున్న వారి కోసం


# హెల్ప్‌లైన్

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి



అమరావతి: ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారిని క్షేమంగా రాష్ట్రానికి తీసుకొస్తామని చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి, ఏపీఎన్నార్టీఎస్ అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. అందుకోసం చర్యలు ఇప్పటికే చేపట్టామన్నారు. సోమవారం అమరావతిలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వారికి ఏపీఎన్నార్టీఎస్ కోఆర్డినేటర్ల ద్వారా తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అలాగే తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లు వినియోగించుకోవాలంటూ గల్ఫ్‌లో చిక్కుకున్న వారికి ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి సూచించారు. తమ సమస్యలు.. ఏపీఎన్నార్టీఎస్ హెల్ప్‌లైన్ నెంబర్ 0863-2340678కు చెప్పొచ్చని తెలిపారు. ఈ నెంబర్ వారంలో ఏడు రోజులు.. 24 గంటలు సైతం పని చేస్తుందని పేర్కొన్నారు. అలాగే వాట్సాప్ నంబర్ ?91 85000 27678 సమస్యలు చెప్పొచ్చంటూ గల్ఫ్‌లో చిక్కుకున్న వారికి వివరించారు. ఇక ఈ-మెయిల్: ర॥÷భ్గై÷తిని॥అజూనిసబిబ.ఇనీపను సంప్రదించవచ్చు వారికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# బాన్సువాడ ఘటన దురదృష్టకరం



కామారెడ్డి: హిందూ ధర్మ పరిరక్షణ కోసం అందరం కలిసి పోరాడాల్సిన సమయం వచ్చిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇటీవల బాన్సువాడలో జరిగిన ఘటన దురదృష్టకరమని చెప్పారు. కామారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. పెద్దలతో బేరసారాలు కుదుర్చుకుని వారి జోలికి వెళ్లడం లేదన్నారు. మూసీ ఒడ్డున గాంధీ విగ్రహం పేరిట, ఖమ్మంలోని భూదాన్ భూముల్లో పేదల ఇళ్ల కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బఫర్ జోన్‌లో ఎన్ని ఇళ్లున్నాయి? ఎన్ని కూల్చారు? అనే దానిపై చర్చకు సిద్ధమా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఏఐసీసీ అగ్రనేత, లోక్సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన పర్యటన పాకెట్ మనీ కోసమేనా అని ప్రశ్నించారు. గాంధీ కుటుంబానికి కాంగ్రెస్ రూ.10 వేలకోట్లు ఇవ్వ గలదని సీఎం రేవంత్ రెడ్డే చెప్పారన్నారు. ఒక్క తెలంగాణ నుంచే వెయ్యి కోట్లు గాంధీ కుంబానికి వెళ్తాయని ఆరోపించారు. కామారెడ్డి బాన్సువాడలో జరిగిన కలహాలలో జైలుకి పోయిన బాధితుల కుటుంబ సభ్యులను బండి సంజయ్ పరామర్శించారు. ముఖ్యమంత్రి బలిసినోడిని వదిలి పెట్టి నిరుపేదల జోలికి పోతున్నారు. రాహుల్ గాంధీ చేస్తున్నది రాజకీయ పర్యటనా? లేక కలెక్షన్ల సమీక్షనా? అని రాష్ట్రం చూస్తుందని అన్నారు. హైదరాబాద్ లో ఫాతిమా కళాశాలను వదిలి పెట్టి ఖమ్మంలో కళాశాలలను కూల్చిన గొప్పతనం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది. రాష్ట్ర ముఖ్యమంత్రి పేదల జోలికి వస్తె అదే బోల్డోజర్లు తీసుకుని నీపైకి వస్తాం. గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయక పోయినా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మనం తీసుకున్న తప్పుడు నిర్ణయం వల్లనే మనం ఈ గోస పడుతున్నాం. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మనం ఆలోచించి ఓటు వేయాలి. కామారెడ్డిలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డిపై దాడి చేశారు. కాంగ్రెస్ పార్టీ దాడులు చేస్తే మేము సహించి ఊరుకోవడానికి బిఆర్ఎస్ నాయకులం కాదు. దేశంలో 20 రాష్ట్రాల్లో మేము అధికారంలో ఉన్నాం. అరాచకాలు, కూల్చివేతలు వెంటనే మానండి, ఇలాంటివి పునరావృతం అయితే మా ప్రణాళిక మేము సిద్ధం చేసుకుంటాం. గత 9 రోజులుగా వికారాబాద్ జిల్లా అనంతగిరి గుట్టల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం కొనసాగు వేశంలో పాల్గొని డీసీసీ అధ్యక్షులు,
ముఖ్య నేతలకు దిశా నిర్దేశర చేసేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్గాంధీ ఇక్కడికి వచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళిక బద్ధంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కా ర్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై వారితో చర్చించారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ రాహుల్ను ఉద్దేశిం చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.

# వేయికోట్లు వసూలుకు వచ్చారా



హైదరాబాద్: లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఆసక్తికర పోస్టు చేశారు. గాంధీ కుటుంబానికి రూ.1000 కోట్లు ఇస్తానని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్ పోస్టు ప్రాధాన్యం సంతరించుకుంది. ఎక్స్‌లో కేటీఆర్ ఏమన్నారంటే.. 'హలో రాహుల్‌గాంధీ.. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఏటీఎం అయిన తెలంగాణకు స్వాగతం' అంటూ వెల్‌కమ్ చెప్పారు. 'మీరిప్పుడు సీఎం దగ్గర రూ.1000 కోట్లు వసూలు చేసుకోవడానికి వచ్చారా..?' అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. 'పనిలోపనిగా మీరు 100 రోజుల్లో అమలుచేస్తామని చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 ఇతర వాగ్దానాల పురోగతిని సమీక్షించడంపై కూడా కొంచెం శ్రద్ధ పెట్టండి' అని సూచించారు.?

**అన్నారం బ్యారేజీ కూల్చివేతకు కుట్రలు**
**ఎక్స్‌వేటర్లతో ఇసు క తవ్వకాలే నిదర్శనం**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీపై కుట్రలు చేసింది చాలదన్నట్టు, అన్నారం బ్యారేజీని కూల్చేందుకు కుతంత్రాలకు తెరతీశారా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. నిబంధన లకు పాతరేసి ఏకంగా బ్యారేజీ కిందే భారీ ఎక్సవేటర్లతో ఇసుక తవ్వకాలు జరపడం దుర్మార్గమే కాదు.. అతిపెద్ద నేరమని అన్నారు. బ్యారేజీ సమీపంలో ఇసుక తవ్వకాలు చేపట్టకూడదన్న రూల్స్ ను బ్రేక్ చేసిన మాఫియాపై వెంటనే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏకంగా బ్యారేజీని బలహీనపరిచి బీఆర్ఎస్ పై బురదజల్లే పన్నాగాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసేందుకు నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ చేస్తున్న అరాచకపర్వాన్ని అన్నదాతలు క్షమించే ప్రసక్తే లేదని అన్నారు. నిబంధనలు తుంగలో తొక్కి అన్నారం బ్యారేజి పిల్లర్ల వద్ద ఇసుక తవ్వకాలు చేసి బ్యారేజీని రేవంత్ సర్కార్ ప్రమాదంలోకి నెడుతుందని తెలిపారు. ఇది ఖచ్చితంగా కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసే కుట్రే అని ఆరోపించారు. పట్టపగలే, నిస్సిగ్గుగా అన్నారం బ్యారేజ్ నుండి కాంగ్రెస్ నాయకుల ఇసుక మాఫియా ఇసుకను తోడేస్తుందని మండిపడ్డారు. తెలంగాణ వనరులను కాంగ్రెస్ పార్టీ ఎలా కొల్లగొడుతుందో చెప్పడానికి ప్రత్యక్ష ఉదాహరణ ఇది అని చెప్పారు.కాళేశ్వరం బ్యారేజీలకు ఏమైనా జరిగితే పూర్తి బాధ్యత కాంగ్రెస్ పార్టీదే అని కేటీఆర్ స్పష్టం చేశారు. అందినకాడికి దోచుకో.. దొరికినకాడికి అమ్ముకో.. ఇవే తెలంగాణలో
ఇప్పుడు కాంగ్రెస్ ప్రజా పాలన సూత్రాలు అని వ్యాఖ్యానించారు. తెలంగాణను నిలువు దోపిడి చేస్తున్న కాంగ్రెస్ నాయకులారా.. ప్రజలు మీ భరతం పట్టే రోజు అతి దగ్గరలోనే ఉంది.. ఖబడ్దార్ అని హెచ్చరించారు

**సూర్యాపేట జిల్లా మైనింగ్‌లో అక్రమాలు**
**ఇ-వేలంలో భారీగా అక్రమాలు**

**వెంటనే మైనింగ్ ప్రక్రియ ఆపాలి**
**సిఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ**

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సూర్యాపేట జిల్లాలో మైనింగ్ ఈ-వేలంలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని స్వతంత్ర విచారణ చేసి టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 1,100 ఎకరాల రిజర్డ్వ ఫారెస్ట్‌పై స్పష్టత లేకుండానే వేలం నిర్వహించారని ఆరోపించారు. కీలక సాంకేతిక వివరాల్లో లోపం, లాటిట్యూడ్, లాంగిట్యూడ్, డీజీపీఎస్ సర్వే వివరాలు వెల్లడించలేదని విమర్శించారు. జియోలాజికల్ నివేదికలు సైతం లేవని ఆరోపించారు. మినరల్ ఆక్షన్ రూల్స్-2015 ఉల్లంఘన జరిగిందని హైకోర్టు సూచనలు పట్టించుకోలేదన్నారు. పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్ల ప్రకటన,కంపెనీల ఎంపికపై అనుమానాలున్నాయని పేర్కొన్నారు. మైనింగ్‌లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కేసులు ఎదుర్కొంటున్న డెక్కన్ సిమెంట్స్, ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్‌కు బ్లాక్‌ల కేటాయింపుపై సందేహాలున్నాయని తెలిపారు. టెండర్ రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అన్ని అనుమతుల తర్వాతే పారదర్శకంగా కొత్త వేలం నిర్వహించాలని సూచించారు. గనుల శాఖ చేపట్టిన ఈ వేలం పక్రియ పారదర్శకతకు విరుద్ధంగా సాగిందని ఆయన విమర్శించారు. టెండర్ నోటీసు జారీకి ముందే మినరల్ బ్లాక్‌లను ఖచ్చితంగా గుర్తించి పూర్తి వివరాలు వెల్లడించడం తప్పనిసరి అయినప్పటికీ, ఈ నిబంధనలు పాటించలేదని విమర్శించారు. ఈ అక్రమ టెండర్లపై మరింత ఆందోళన కలిగించే అంశాలను కూడా ఆయన లేఖలో ప్రస్తావించారు. న్యాయపరమైన విచారణలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వేలాన్ని ముందుకు తీసుకెళ్లడం, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన సూచనలను పట్టించుకోకపోవడం, చట్టపరమైన , పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్లను ప్రకటించడం వంటి అంశాలు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. మైన్స్ అండ్ జియోలజీ శాఖ లీగల్ ఆఫీసర్ ఈ బ్లాక్‌ల సమాచారాన్ని గోప్యంగా పేర్కొంటూ ఫిర్యాదుదారునికి ఇవ్వడానికి నిరాకరించడం పారదర్శకతపై అనుమానాలు పెంచుతోందని అన్నారు.ప్రస్తుత వేలం పక్రియకు సంబంధించిన అన్ని చర్యలను తక్షణమే నిలిపివేయాలని, టెండర్ పక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర , పారదర్శక విచారణను నిర్ణీత కాలపరిమితి లో పూర్తి చేయాలని, అవసరమైన శాస్త్రీయ సర్వేలు, జియోలాజికల్ డేటా వెల్లడి, అటవీ అనుమతులు పొందిన తర్వాత మాత్రమే చట్టబద్ధంగా కొత్త టెండర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాలని కేటీఆర్ కోరారు. ఈ లేఖ ప్రతులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూడా పంపారు.

# మోదీ దుర్మార్గాలపై యుద్ధం చేయాలి



వికారాబాద్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దుర్మార్గాలన్నీ బయటపడుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, రాహుల్ గాంధీ తెలిపారు. మోదీ తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాహుల్ సూచించారు. అందుకు కార్యకర్తలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. వికారాబాద్‌లో పీఏసీ సభ్యులతో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాహుల్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని సూచించారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇరాన్ లాంటి పరిస్థితులు దేశానికి రాకుండా ఉండాలన్నారు. మోదీ ప్రభుత్వ చర్యల వల్ల ఇండియాలో యుద్ధం వచ్చే పరిస్థితులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండో-అమెరికన్ ట్రేడ్ డీల్‌తో ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణలో పార్టీ.. ప్రభుత్వం కలిసి మంచిగా పనిచేస్తున్నాయని రాహుల్ పేర్కొన్నారు. సామాజిక అంశాలపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు పెట్టాలని పార్టీ సీనియర్ నేత వీహెచ్ కోరగా.. అందుకు రాహుల్ సమ్మతి తెలిపారు. సమావేశంలో రెండు తెలుగు రాష్ట్రాల పీఏసీ సభ్యులు పాల్గొన్నారు. రాహుల్ గాంధీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్, మహేష్ గౌడ్, వైఎస్ షర్మిల తదితరులు హాజరయ్యారు. సమావేశం అనంతరం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్.. ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నుంచి అనంతగిరి హరితా రిసార్ట్స్‌కు బయలుదేరారు. అక్కడ జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొనన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, తెలంగాణ, ఏపీ పీసీసీ చీఫ్‌లు మహేశ్‌కుమార్ గౌడ్, షర్మిలతో పాటు ముఖ్యనేతలు హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై నేతలతో రాహుల్ చర్చించారు. గత 9 రోజులుగా ఏపీ, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల శిక్షణ శిబిరం అక్కడ కొనసాగుతోంది. అంతుకుముందు ఉదయం ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రాహుల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరువురూ వికారాబాద్ జిల్లాకు బయలుదేరారు. వికారాబాద్ ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రాంగణంలో పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశానికి రాహుల్ గాంధీ హాజరు అయ్యారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సమావేశంలో ప్రస్తుత రాజకీయ అంశాలు, పార్టీ బలోపేతం తదితర కీలక విషయాలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులను ఖరారు చేసే అవకాశం ఉంది. రాజ్యసభ రేసులో అభిషేక్ సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి, చిన్నారెడ్డి, వీహెచ్, దొమ్మటి సాంబయ్య,
బెల్లయ్య నాయక్, హజ్మతుల్లా హుస్సేన్ ఉన్నారు. వికారాబాద్ చేరుకున్న కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మంత్రి వివేక్ వెంకటస్వామి స్వాగతం పలికారు. హెలిప్యాడ్ దగ్గర బొకేతో స్వాగతం పలికిన మంత్రి వివేక్ రాహుల్ గాంధీని శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో సంపత్ కుమార్, షబ్బీర్ అలీ, సునీతారావులు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. సమావేశంలో సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై రాహుల్ గాంధీ చర్చించినట్లు సమాచారం. రాహుల్ గాంధీతో పాటు కేసీ వేణుగోపాల్ సమావేశంలో పాల్గొన్నారు.

# జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై వాదనలు

హైదరాబాద్:జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై తెలంగాణ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ రిపోర్ట్ ను రద్దు చేయాలంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. కేసీఆర్, హరీశ్ రావు, ఎస్కే జోషి, ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన ఈ పిటిషన్లపై ఇవాళ ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తరఫున నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు.పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కేసీఆర్ తరుపున లాయర్లు వాదనలు వినిపించారు. సాక్షులు ఎవరైనా పిటిషనర్ కు వ్యతిరేకంగా స్టేట్మెంట్ ఇస్తే అప్పుడు నోటీస్ జారీ చేసి వారి వాదన వినాలని చట్టం చెబుతుందని కేసీఆర్ తరఫు న్యాయవాది వెల్లడించారు. నివేదికలో తీవ్ర ఆరోపణలు చేయడం , పిటిషనర్ పరువు, కీర్తికి నష్టం కలిగేలా చేయడం సరైంది కాదని హైకోర్టుకు తెలిపారు.దే సమయంలో ప్రభుత్వ తరఫు న్యాయవాదులు కూడా పలు అంశాలను ప్రస్తావించారు. 'కాళేశ్వరం ప్రాజెక్టులో ఏం జరిగిందో తెలుసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంది. కేసీఆర్, హరీశ్ రావుకు విచారణ కమిషన్ తగిన అవకాశం ఇచ్చింది. తన విధులు నిర్వహించడం లో స్మిత సబర్వాల్ విఫలం అయ్యారని నివేదిక లో ఉంది' అని ప్రభుత్వం తరఫు లాయర్లు హైకోర్టు ధర్మాసనంకు తెలియజేశారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను మంగళవారం మధ్యాహ్నం 2.15 కి వాయిదా వేసింది.

# స్టాక్ మార్కెట్లపై యుద్ధం ప్రభావం

ముంబయి: ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు, చమురు రేట్ల పెరుగుదలతో సూచీలు దారుణంగా పడిపోయాయి. సెన్సెక్స్ 1000 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ 300 పాయింట్ల మేర పడిపోయింది. సోమవారం ఉదయం 9.25 గంటల సమయంలో సెన్సెక్స్ 1,048.48 పాయింట్లు దిగజారింది. దీంతో 80,238.71 వద్ద, నిఫ్టీ 307.35 పాయింట్లు పతనమై 24,871.30 వద్ద కొనసాగుతున్నాయి. రూపాయి విలువ క్షీణించింది. నేటి సెషన్‌లో 24 పైసలు తగ్గింది. దీంతో 91.32గా ట్రేడ్ అవుతోంది. ప్రీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 2,700 పాయింట్లు, నిఫ్టీ 530 పాయింట్లు కుంగడంతో ఇన్వెస్టర్లు తీవ్ర ఆందోళన చెందారు. ప్రస్తుతం మార్కెట్లు కొద్దిగా కోలుకున్నప్పటికీ నష్టాల్లో కొనసాగుతున్నాయి.ఇరాన్-అమెరికా యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు రేట్లు భగ్గుమన్నాయి. ముడి చమురు ధర 80 డాలర్లపైగా ట్రేడ్ అవుతోంది. దీని ప్రభావంతో దేశీయంగా చమురు రంగ షేర్లు బాగా పడిపోయాయి. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ 5 శాతం మేర కుంగింది. మారుతి సుజుకీ, ఏషియన్ పెయింట్స్ వంటి షేర్లు తీవ్ర నష్టాల్లో కొనసాగుతున్నాయి. క్రితం సెషన్‌లో విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.7536 కోట్ల విలువైన ఈక్విటీలను అమ్మారు. ఇది కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది.

# రాహుల్‌ను ప్రధాని చేయడమే మన కర్తవ్యం

వికారాబాద్:లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం మనమంతా కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మోడీ వల్ల దేశానికి తీరని నష్టం జరుగుతోందన్నారు. రాషహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమమని అన్నారు. వికారాబాద్ వేదికగా తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు. గతంలో ప్రజాసమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేసుకున్నారు. ఆదివారం సైతం తాను కోర్టుకు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఈ 19 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి తాను సీఎం అయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో పార్టీ పదవులు సైతం నిర్వహించానని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను మంచి అనుభవం పొందానన్నారు. తనపై అనేక కేసులు పెట్టారని.. పరువు నష్టం దావాలు కూడా వేశారని పేర్కొన్నారు. దేశం కోసం, తమ కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పేర్కొన్నారు. సోనియా గాంధీ పేరుతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని వివరించారు. ఐదేళ్లు చేసిన పోరాటాల వల్ల రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేత అయ్యారని వివరించారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. దేశంలో అనేక సమస్యలపై రాహుల్ గాంధీ పోరాటం చేశారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఇచ్చిన నేతగా సోనియా పేరు చిరస్తాయిగా ఉంటుందని అన్నారు. త్యాగాలు చేసిన కుటుంబం వారిదని అన్నారు.

# రైతులకు ప్రభుత్వం శుభవార్త




**పెండింగ్ విద్యుత్ కనుక్షన్లకు ఆమోదం**

అమరావతి:కూటమి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఏపీలో రైతులకు ఊరట లభించింది. పెండింగ్‌లో ఉన్న 46,113 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అందుకు సంబంధించిన ఆదేశాలు సోమవారం జారీ చేసింది. ఈ నెలాఖరులోగా అనుమతులు జారీ చేయాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. మొత్తం పెండింగ్ దరఖాస్తులు: 46,113 ఉండగా.. వీటికి రూ.250 కోట్ల మేర ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో వ్యవసాయ కనెక్షన్లు మొత్తం 22.30 లక్షలు ఉన్నాయి. కొత్తగా ఇప్పటికే 1.12 లక్షల కనెక్షన్లు మంజూరు చేసింది. పెండింగ్‌లో ఉన్నవి క్లియర్ చేయడానికి మరో 10,000 ట్రాన్స్‌ఫార్మర్లు కేటాయించనుంది. ఈ పెండింగ్‌లో ఉన్న కనెక్షన్లను రెండు నెలల్లో పూర్తి చేయాలని డిస్కంలను విద్యుత్ శాఖ మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో సాగు సీజన్‌కు ముందే వేలాది మంది రైతులకు విద్యుత్ సౌకర్యం లభించే అవకాశం ఉందనే ఒక చర్చ సాగుతోంది.

# రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు

అమరావతి: ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ వ్యవహారంలో ఈ కేసు దర్యాప్తు చేస్తున్న అధికారి ముందు హాజరు కావాలని బిహార్ కేడర్ ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ నాయక్‌ను హైకోర్టు ఆదేశించింది. మార్చి 5వ తేదీ లేదా అంతకంటే ముందు దర్యాప్తు అధికారి ఎదుట హాజరు కావాలని జారీ చేసిన ఆ ఆదేశాల్లో నాయక్‌కు హైకోర్టు స్పష్టం చేసింది. ఎలాంటి కఠిన చర్యలకు పాల్పడకుండా చట్టంలోని నిబంధనలను లోబడి సునీల్ కుమార్ నాయక్‌ను విచారించాలని దర్యాప్తు అధికారికి ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు సూచించింది. ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సోమవారం ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు పై విధంగా స్పందించింది. ఇక మార్చి 9వ తేదీకి సునీల్ కుమార్ ప్రధాన బెయిల్ పిటిషన్ విచారణను హైకోర్టు వాయిదా వేసింది. ఈ సందర్భంగా రాజకీయ కారణాలతో తన పిటిషనర్‌ను నిందితుడిగా చేర్చారంటూ సునీల్ తరఫు సీనియర్ న్యాయవాది పరమేశ్వర్ వాదనలు వినిపించారు. ఈ కస్టోడియల్ టార్చర్‌తో సునీల్ నాయక్‌కు సంబంధం లేదని కోర్టు దృష్టికి ఈ సందర్భంగా పరమేశ్వర్ తీసుకెళ్లారు. ఇంకోవైపు సునీల్ నాయక్ వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌కు విచారణ అర్హత లేదని పోలీసుల తరఫు సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా కోర్టుకు వివరించారు.

# ఇజ్రాయిల్ దాడుల్లో 550 మంది మృతి ఇరాన్ అధికారిక మీడియా వెల్లడి



టెహ్రాన్:పశ్చిమాసియాలో మూడోరోజూ కూడా ఉద్రిక్తతలు కొనసాగుతున్నారు. అమెరికా మద్దతుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. క్షిపణి స్థావరాలను టార్గెట్ చేసుకుంటూ, యుద్ధనౌకలను ధ్వంసం చేస్తోంది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేస్తోంది. కాగా, గత శనివారంనాడు యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇంతవరకూ తమదేశంలో ఇరాన్ సుప్రీం లీడర్, ఇతర సీనియర్ అధికారులతో సహా 550 మందికి పైగా మరణించినట్టు ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేన్ మృతికి ప్రతీకారం తీర్చుకుంటామని ఆదేశ మిలటరీ కమాండర్లు ప్రకటించారు. యూఏఈ సహా గల్ఫ్ దేశాలపై దాడులు తీవ్రతరం చేయడంతో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. తాజా పరిస్థితి యావత్ మధ్యప్రాచ్యాన్ని యుద్ధం వైపు నడిపే అవకాశాలున్నాయనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. దుబాయ్ ఎయిర్ పోర్ట్, బుర్జ్ ఖలిఫా, బహ్మేన్, కువైట్‌లోని అమెరికా స్థావరాలను ఇరాన్ టా÷-గ్గ÷ట్ చేస్తోంది. మరోవైపు, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రధాన కార్యాలయానికి ధ్వంసం చేసినట్టు అమెరికా మిలటరీ ప్రకటించింది. కాగా, యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షాకింగ్ ప్రకటన చేశారు. 'ఆపరేషన్ ఎపిక్ క్యూరీ'లో భాగంగా 'ఒకే షాట్'లో 48 మంది ఇరానియన్ టాప్ లీడర్లను మట్టుపెట్టామని తెలిపారు. 9 యుద్ధ నౌకలను ధ్వంసం చేశామని చెప్పారు. ఇరాన్ నావికాదళ ప్రధాన కార్యాలయాన్ని కూడా ధ్వంసం చేశామని, ఈ చర్యలో కనీసం ముగ్గురు అమెరికా సైనికులు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడినట్టు పేర్కొన్నారు. యుద్ధం మరో 4-5 వారాలు పట్టవచ్చుంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.






# అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీ మృతి

**ఇజ్రాయెల్, గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై శనివారం రాత్రి ఇరాన్ విరుచుకుపడింది. బహ్రెయిన్, కువైట్, ఖతార్‌లలోని స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. డజన్లకొద్దీ క్షిపణులను, వందలకొద్దీ డ్రోన్లను ఇరాన్ ప్రయోగించిందని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది.**

అమెరికా, ఇజ్రాయెల్ అనుకున్నంత పనీ చేశాయి. రెండు దేశాలు సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. యుద్ధం ప్రారంభమైన తొలి రోజే ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ఆయన కార్యాలయంపై దాడులు చేయడంతో ఖమేనీతోపాటు 40 మంది అత్యున్నత సైనికాధికారులు మృతి చెందారు. ఖమేనీ మృతిని ఆదివారం ఉదయం ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఇర్నా అధికారికంగా ప్రకటించింది. ఆ వార్త దావానలంలా వ్యాపించడంతో భారత్‌సహా ప్రపంచ వ్యాప్తంగా షియా ముస్లింలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. నిరసనల సందర్భంగా పాకిస్థాన్‌లోని కరాచీలో 10 మంది మృతి చెందారు. మరోవైపు ఇరాన్ తీవ్రంగా ప్రతీకార దాడులు చేసింది. దీంతో యుద్ధం మరింత విస్తరించింది. ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. విమానాశ్రయాలు, దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫాసహా పలు భవనాలకు నష్టం కలిగింది. ఇజ్రాయెల్‌లో 11 మంది చనిపోగా.. తమ సైనికులు ముగ్గురు మరణించారని అమెరికా ప్రకటించింది. గల్ఫ్‌లోని మరిన్ని చోట్లా మరణాలు సంభవించాయి. చాలా మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో భారతీయులూ ఉన్నారు. పశ్చిమాసియాలో ఆదివారమూ వందల విమానాలు రద్దయ్యాయి. భారత్ నుంచి దాదాపు 220 విమానాలు నిలిచిపోయాయి. దీంతో వేల మంది విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోయారు. అమెరికా యుద్ధ నౌకపై క్షిపణులు పేల్చామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. మరోవైపు ఖమేనీ వారసుడి ఎన్నిక ఒకట్రెండు రోజుల్లో జరగనుంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్ డౌన్‌టౌన్‌లోని ఖమేనీ కార్యాలయంపై భారీగా బాంబు దాడులు జరిగిన దృశ్యాలు శాటిలైట్ చిత్రాల్లో కనిపించాయి. ఈ దాడుల్లోనే 86 ఏళ్ల ఖమేనీ మరణించినట్లు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఆదివారం ఉదయం ప్రకటించింది. ఆయనతోపాటు కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు మృతి చెందారు. చరిత్రలోనే అత్యంత దుర్మార్గమైన వ్యక్తి మరణించారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఖమేనీతోపాటు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ అత్యున్నతాధికారి, ఖమేనీ భద్రతా సలహాదారు మేజర్ జనరల్ మహమ్మద్ పాక్‌పౌర్ మరణించారు. ఖమేనీ మరణంతో టెహ్రాన్‌లో కొందరు భవనాల పైకి వచ్చి సంతోషం వ్యక్తం చేశారు. మరోవైపు వేల మంది నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. షియా ముస్లింల ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రమైన మషాద్‌లో జెండాను అవనతం చేశారు. ఖమేనీపై దాడుల వివరాలను ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) ఆదివారం వెల్లడించింది. వైమానిక దాడుల్లోనే ఆయన మరణించారని పేర్కొంది. శనివారం ఉదయం.. డజన్ల సంఖ్యలోని సైనిక స్థావరాలపై విస్తృత స్థాయిలో, సమన్వయంతో అమెరికాతో కలిసి దాడులు చేశామని తెలిపింది. ఇరాన్‌లోని బాలిస్టిక్ క్షిపణి కేంద్రాలపై అమెరికా బీ-2 స్టెల్త్ బాంబర్లను వేసింది. ప్రభుత్వాన్ని ఆధీనంలోకి తీసుకోవాలని ప్రజలకు ట్రంప్ పిలుపునిచ్చినా ఇరాన్‌లో పెద్దగా స్పందన కనిపించలేదు. ఆదివారం టెహ్రాన్‌లో వీధులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. యూఏఈలోని విమానాశ్రయం, పలు ఇతర భవనాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణులను ప్రయోగించింది. దుబాయ్ విమానాశ్రయం, బుర్జ్ ఖలీపాలపై దాడులు జరిగాయి. క్షిపణుల కారణంగా బుర్జ్ అల్ అరబ్ హోటల్‌వద్ద మంటలు వచ్చాయని, అయితే ఎవరికీ గాయాలు కాలేదని యూఏఈ ప్రభుత్వం వెల్లడించింది. జెబెల్ అలీ పోర్టువద్ద క్షిపణులను రక్షణ వ్యవస్థలు అడ్డుకోవడంతో శిథిలాలు పడ్డాయని, ఎవరికీ గాయాలు కాలేదని తెలిపింది. దుబాయ్ విమానాశ్రయంవద్దా అత్యవసర పరిస్థితి తలెత్తింది. మొత్తంగా ఇప్పటిదాకా యూఏఈలో ముగ్గురు మరణించగా.. 58 మంది గాయపడ్డారు. చనిపోయిన వారిలో పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్ జాతీయులున్నారు. అబుధాబిలోని జాయేద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై శనివారం రాత్రి ఇరాన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇద్దరు మృతి చెందగా ఏడుగురు గాయపడ్డారు. ఇప్పటిదాకా 165 క్షిపణులు, 541 డ్రోన్లు తమ దేశం దిశగా దూసుకొచ్చాయని యూఏఈ రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. 152 క్షిపణులను కూల్చేశామని, మిగిలినవి సముద్రంలో కూలిపోయాయని వివరించింది. 506 డ్రోన్లను కూల్చేశామని, మిగిలినవి భూభాగంతోపాటు సముద్రంలో కూలిపోయాయని తెలిపింది.

స్ట్రెయిట్ ఆఫ్ హర్మూజ్‌లో చమురు నౌకపై జరిగిన దాడిలో నలుగురు సిబ్బంది గాయపడ్డారు. ఈ నౌకలో భారతీయ సిబ్బందీ ఉన్నారు. 3 బ్రిటన్, అమెరికా చమురు నౌకలపై దాడులు చేశామని ఇరాన్ ప్రకటించింది. ఈ జలసంధిపై దాడులు జరుగుతుండటంతో చమురు రవాణాకు అంతరాయం కలిగే అవకాశముంది.

ఇరాన్ క్షిపణులను అడ్డుకున్నామని ఖతార్, బహ్రెయిన్, కువైట్ ప్రకటించాయి. ఖతార్‌లో 16 మంది గాయపడ్డారు. మినాబ్‌లో పాఠశాల భవనంపై బాంబులు పడిన ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య 165కి చేరుకుంది. ఇజ్రాయెల్‌లో భారీ పేలుళ్లు సంభవించాయి. ఇరాన్ జరిపిన ఈ దాడుల్లో 9 మంది మృతి చెందగా.. 28 మంది గాయపడ్డారు. బీట్ షెమెష్‌లోని సైనాగోగ్‌పై ఈ దాడి జరిగింది. దీంతో ఇప్పటిదాకా ఇజ్రాయెల్‌లో 11 మంది మృతి చెందినట్లయింది. మరో 9 మంది గల్లంతయ్యారు. 120 మంది గాయపడ్డారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ మొదలైనప్పటి నుంచి ఇప్పటిదాకా ముగ్గురు సైనికులు మరణించారని, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని అమెరికా వెల్లడించింది.

విమాన వాహక యుద్ధ నౌక యూఎస్‌ఎస్ అబ్రహాం లింకన్‌పై నాలుగు బాలిస్టిక్ క్షిపణులతో ఇరాన్ దాడి చేసింది. అయితే ఈ వార్తలను అమెరికా సైన్యం ఖండించింది. 49 డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకున్నామని జోర్డాన్ వెల్లడించింది. కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే ప్రక్రియను కౌన్సిల్ ప్రారంభించిందని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తెలిపారు. అమెరికా, ఇజ్రాయెల్ గీత దాటాయని, మూల్యం చెల్లించుకుంటాయని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘెర్ ఖలీబా హెచ్చరించారు.

**ఇప్పటిదాకా మృతులు, గాయపడినవారు**

| దేశం | మృతులు | గాయపడినవారు |
|---|---|---|
| ఇరాన్ | 201 | 747 |
| ఇజ్రాయెల్ | 10 | 120 |
| అమెరికా | 3 | 5 |
| ఇరాక్ | 2 | 5 |
| కువైట్ | 1 | 32 |
| బహ్రెయిన్ | - | 4 |
| ఖతార్ | - | 16 |
| యూఏఈ | 3 | 58 |
| ఒమన్ | - | 5 |

# చెంపదెబ్బ...గోడదెబ్బ !

దేశంలో రెండు అసాధారణమైన కేసులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. న్యాయవ్యవస్థ గట్టిగా నిలబడేలా తీసుకున్న చర్యలు ఇప్పుడు రాజకీయ నాయకుల కళ్లు తెరిపిస్తాయా లేదా అన్నది చూడాలి. ముందుగా ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కామ్‌పై ఇచ్చిన తీర్పు ఒకటయితే.. ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల్లో న్యాయవ్యవస్థపై అచ్చేసిన పాఠ్యాంశం మరొకటి. ఈ రెండు కేసుల్లో న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులు లేదా ఆదేశాలు నేరుగా కేంద్రాన్ని ప్రశ్నించాయి. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిలదీసాయి. ఇంతకన్నా ఘోరం మరోటి ఉండదు. ఎందుకంటే తమ చేతుల్లో ఉన్న అధికారాన్ని గుప్పిట పెట్టుకుని దర్యాప్తు సంస్థల ద్వారా లిక్కర్ కేసును అల్లిన తీరు చూస్తే ఇడి, సిబిఐల పరువు పోయింది. సిబిఐ అధికారిపై విచారణ చేయాలని ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలు చూస్తే కేంద్రం సిగ్గుతో తలదించుకోవాలి. ఇక్కడ సిబిఐ ఇంత నిర్లక్ష్యంగా ఓ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసినందుకు బాధపడాలి. అంటే దాని ప్రతిష్టను అదే దిగజార్చుకుంది. కనీస సమాచారం, దానికి తగ్గ అవసరమైన సాక్ష్యాలు లేకుండా ఓ కేసును గాలిలో మేడలు కట్టినట్లుగా అల్లడం వెనక ఎంతటి నిర్లక్ష్యం ఉందో తెలియచేసింది. రాజ్యాంగ పదవిలో ఉన్న సిఎం కేజ్రీవాల్‌ను జైలులో పెట్టారు. ఉపముఖ్యమంత్రి సిసోడియాను జైలులో పెట్టారు. అంటే ఎంతటి దుర్మార్గానికి సిబిఐ, ఇడిలు ఒడిగట్టాయన్నది తేలిపోయింది. ఇదే విషయాన్ని జడ్జి ప్రశ్నించారు. నిజంగానే లిక్కర్ పాలసీ కేసు అన్నది ఓ అభూత కల్పన కేసు. అందులో ముడుపులు ముట్టాయనడానికి ఆధారాలు లేవు. ఈ కేసుతో సిబిఐ తన తీరును మార్చుకోవాలి. పక్కా సమాచారంతో కేసులను చేపట్టాలి. తద్వారా పోయిన ప్రతిష్టను ఇనుమడించేలా చేసుకోవాలి. ఇది సిబిఐ పరువే కాదు, దేశానికి సంబంధించి ప్రతిష్ట కూడా ఇందులో దాగి ఉంది. సిబిఐ సరిగా పనిచేస్తేనే, ప్రజలకు నమ్మిక ఉంటుంది. ఈ కేసులో ఆధారాలు ఉంటేనే హైకోర్టుకు వెళ్లడం మంచిది. అక్కడా భంగపడేకన్నా ఆధారాలు, సాక్ష్యాలను సేకరించాలి. ప్రాథమికి సమాచారం ఉంటేనే ముందుకు నడవాలి. రాజకీయ కక్షసాధింపులకు పాల్పడే కేసుల నుంచి సిబిఐ, ఇడిలలను దూరంగా ఉంచడం మంచిది. నిజానికి కెసిఆర్ హయాంలో జరిగిన అవినీతిపై కేసులు లేవు. జగన్ హయాంలో జరిగిన ఆర్థిక అవతవకతలపైనా కేసులు లేవు. ఇలాంటి వారి వల్ల ప్రజాధనం దుర్వినియోగం అయ్యింది. వీటిపై చర్యలు తీసుకుంటే రాష్ట్రాల్లో పాలకుల్లో భయం ఉంటుంది. ఇకపోతే మరో కేసులో సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపాయి. జాతీయ, విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఎన్‌సిఇఆర్‌టి ప్రచురించిన ఎనిమిదో తరగతి సాంఘికశాస్త్రంలో 'కరప్షన్ ఇన్ ది జ్యూడిషియరీ' అనే పాఠ్యాంశం తీవ్ర వివాదమైంది.



సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సూమోటోగా విచారణకు తీసుకోవడమే గాక.. ఆ సందర్భంగా ఆగ్రహంతో స్పందించిన తీరు, సిజెఐ చేసిన వ్యాఖ్యలు దేశాన్ని కుదిపేశాయి. 'న్యాయవ్యవస్థ అధికారాన్ని అణచివేసేలా, గౌరవాన్ని కించపర్చేలా, ఉద్దేశ్య పూర్వకంగా చేసిన కుట్రగా ఇది కనిపిస్తోంది. దీనిని పట్టించుకోకుండా వదిలేస్తే ప్రజలు, యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతినే అవకాశం ఉంది.' అని విచారణ సందర్భంగా సిజెఐ అన్న వ్యాఖ్యలు అక్షర సత్యాలు. జవాబుదారీతనం ఏర్పడేంతవరకు ఈ వ్యవహారాన్ని మేం వదలిబెట్టం. దీని వెనుక ఎవరున్నారో మేం తెలుసుకోవాలనుకుంటున్నామని సిజెఐ అనడం చూస్తుంటే.. ఎంతటి నిర్లక్ష్యం ఉందో తేటతెల్లం అయ్యింది. ఈ వ్యవహారంతో కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణలు చెప్పవలసి వచ్చింది. ఆ చాప్టర్లను ఇద్దరు వ్యక్తులు రూపొందించారని, వారు యుజిసి లేదా మరే మంత్రిత్వ శాఖతోనూ కలిసి పనిచేయడం లేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరణ ఇచ్చారు. ఆ పాఠ్యాంశాన్ని ముద్రించిన ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాన్ని పూర్తిగా నిషేధం చాలని, ఇప్పటికే ప్రచురితమైన పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించడం ద్వారా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని గట్టిగా నిలదీసినట్లు అయ్యింది. అయితే 8వ తరగతి పాఠ్యాంశం వంటిది హఠాత్పరి ణామం కాదు. గత దశాబ్ద కాలంగా ఎన్‌సిఇఆర్‌టి, ఇతర కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థల చర్యలు తరచు వివాదాస్పదంగా మారుతున్న విషయం అందరికీ తెలిసిందే! పాఠ్యాంశాల్లో కొన్ని తొలగింపులు, అర్థరహిత మైన చేర్పులతో మీడియాలో పతాక శీర్షికల్లో వస్తూనే ఉన్నాయి. ఆయా సందర్భాల్లో చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలూ వాటిని ఎత్తిజూపి ప్రజలు, ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నారు

. ఇప్పుడు నేరుగా న్యాయ వ్యవస్థనే టార్గెట్ చేయడం, సుప్రీం ధర్మాగ్రహంతో కేంద్రం ఆత్మరక్షణలో పడింది. నేరుగా ప్రధానమంత్రి కార్యాలయమే రంగంలోకి దిగి నష్ట నివారణ చర్యలు చేపట్టవలసి వచ్చింది. ఈ రెండు వ్యవహారాల్లో కేంద్రం నేరుగా దొరికి పోయింది. కేజ్రీవాల్‌ను అణచివేసే కుట్ర జరిగిందన్న ఇక్కడ తెలిసిపోయింది. అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పుట్టుకుని వచ్చిన కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి అయ్యారు. పంజాబ్‌లో పాగా వేశారు. దేశంలో అనేక చోట్ల ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయనను అవినీతి ముద్రతో అణివేసే ప్రయత్నం జరిగిందన్న వాదనలు వచ్చాయి. తెలంగాణలో కెసిఆర్ తనయ కవితను కూడా ఇందులో చేర్చారు. నిజానికి ఈ కేసు బలంగా ఉంటే కోర్టు ఇంత తీవ్రంగా వ్యాఖ్యలు చేసివుండేది కాదు.

## మరోమారు భగ్గుమన్న పుత్తడి ధరలు

### పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యుల బెంబేలు



న్యూఢిల్లీ: దేశంలో బంగారం, వెండి ధరలు సామాన్యుల అంచనాలకు అందని విధంగా మారుతున్నాయి. రెండు రోజుల పాటు దాదాపు స్థిరంగా కొనసాగిన ధరలు శనివారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దేశంలో బంగారం ధర సగటున రూ.3 వేల మేర పెరగ్గా వెండి ధర కూడా చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఎగబాకింది. అసలే పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యులకు ధరలు కంగారు పెట్టిస్తున్నాయి.

గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,64,730లకు చేరుకుంది. నిన్నటి ముగింపు ధరతో పోలిస్తే ఏకంగా రూ.3,160ల మేర పెరిగింది. ఇక 22 క్యారెట్ పసిడి ధర కూడా రూ.2,900ల మేర పెరిగి రూ.1,51,000లకు చేరుకుంది. నగరంలో వెండి ధర కూడా రూ.5 వేల మేర పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి రూ.3 లక్షలుగా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర గరిష్ఠంగా రూ.1,65,820కు చేరింది. ముంబై, కర్ణాటక, బెంగళూరు నగరాల్లో మేలిమి బంగారం ధర రూ.1,64,730గా ఉంది. ఢిల్లీలో రూ.1,64,880ల వద్ద కొనసాగుతోంది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర (10 గ్రాములు) చెన్నైలో రూ.1,52,000గా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.1,51,000 వద్ద కొనసాగుతోంది. నగరాల వారీగా వెండి ధరలను పరిశీలిస్తే.. చెన్నైలో కిలో వెండి ప్రస్తుతం రూ.3 లక్షలకు చేరుకుంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.2.95 లక్షల వద్ద కొనసాగుతోంది.

## తిరుపతి ఎస్వీ జూపార్క్‌కు అరుదైన వన్యప్రాణులు

### పరస్పర మార్పిడితో జంతువుల రాక

తిరుపతి: తిరుపతి ఎస్వీ జూపార్కుకు త్వరలో అరుదైన వన్యప్రాణులు రానున్నాయి. విశాఖ జూపార్కు, హైదరాబాదు జూపార్కు, చెన్నైలోని క్రొకోడైల్ బ్యాంకు ట్రస్టు, గుజరాత్ రాష్ట్రం జాంనగర్‌లోని గ్రీన్స్ జువాజికల్ రెస్క్యూ అండ్ రిహాబిటేషన్ సెంటర్ నుంచి మొత్తం 61 వన్యప్రాణులు తిరుపతికి రానున్నాయి. పరస్పర వన్యప్రాణి మార్పిడి విధానం ద్వారా వీటిని తెప్పించనున్నట్లు ఇక్కడి జూ అధికారులు చెప్పారు. తిరుపతినుంచి గరియల్-2, ఇండినగ్ గౌడ్-2, జపనీస్ కోయల్ -4, మస్కోవి డెక్ -4, గే పిలికాన్ -2, వైటఖ్ ఈబీస్ 2 హైదరాబాద్ లోని నెహ్రూ జులాజికల్ పార్కుకు పంపిస్తారు. అక్కడినుంచి మగ్గర్ క్రోకోడైల్స్ -4, ఇండియన్ మౌస్ డీర్-6, రింగ్ నెక్కుడ్ పీసెంట్ -2, గో÷-డలెన్ పీసెంట్-2, సిల్వర్ పీసెంట్ -1, రెడ్ జంగిల్ ఫోవల్ -2, జంధ్యాకోనూరే 2 ఇక్కడికి రానున్నాయి. మద్రాస్ క్రొకోడైల్ బ్యాంకు ట్రస్టు నుంచి మొసళ్లు-5, ఉప్పునీటి మొసళ్లు 2, ఎల్లో అనకొండ-9 ఎస్వీ జూపార్కుకు రానున్నాయి. విశాఖలోని ఇందిరాగాంధీ జువాజికల్ పార్కు నుంచి ఒక తెల్లపుల్లి ఎస్వీ జూపార్కుకు రానుండగా ఇక్కడున్న తెల్లపులిని వారికి పంపిస్తారు. రెండు అడవికుక్కలు, ఒక తోడేలు, రెండు జింకలు, బూడిదరంగు అడవికోళ్లు రెండు విశాఖ జూకు పంపించనున్నారు. దానికి బదులుగా అక్కడి నుంచి ఒక తోడేలు, రెండు అడవికుక్కలు, రెండు అడవిపిల్లులు, రెండు నీల్‌గై, నాలుగు గ్రీన్ ఇగ్వనాలను తిరుపతి జూపార్కుకు అందజేయనున్నారు. జామ్‌నగర్‌కు తెల్లపులి ఒకటి, ఇండియన్ గౌర్ రెండు, బ్లాక్ బక్-10, సాంబార్-10, బార్కింగ్ డీర్-2, మస్క్వేడక్-2, జాగ్వర్ ఒకటి అందజేస్తారు.

ఉత్తేజిత దినపత్రిక

# రైతు సంస్కృతికి ప్రతీకగా కొణిదేలలో ఎద్దుల బండలాగుడు పందాలు

## – ఎమ్మెల్యే గిత్త జయసూర్య హాజరు..



**ఉత్తేజిత ప్రతినిధి.. నందికొట్కూరు మార్చి 02**



నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం కొణిదేల గ్రామంలో శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున తిరణాల సందర్భంగా నిర్వహించిన పెద్ద బండ ఎద్దుల బండలాగుడు పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య ముఖ్య అతిథిగా హాజరై టెంకాయ కొట్టి పోటీలకు శ్రీకారం చుట్టారు. అనంతరం గ్రామ పెద్దలు, నాయకులు ఆయనను గజమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎద్దుల బండలాగుడు పోటీలు గ్రామీణ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని, రైతు జీవితానికి అద్దం పడతాయని పేర్కొన్నారు. యువత సంప్రదాయ క్రీడల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న రైతులు తమ ఎద్దుల శక్తి, సామర్థ్యాలను ప్రదర్శించగా, భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు ఉత్సాహంగా వీక్షించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సాలె కిరణ్, కొణిదెల సర్పంచ్ కొంగర నవీన్, ఉప సర్పంచ్ భాస్కర్ రెడ్డి,రైతు సంఘం నాయకుడు సిపిఎం రాజు, రంగస్వామి, ఆచారి, బ్రహ్మానందరెడ్డి, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

: మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి



**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు మార్చి 2:**

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డులను సోమవారం ఉదయం నుంచి కోట వీధి చాకలిపేట అల్లు రోడ్డు మద్దిగట్ల పేట, ప్రతి వార్డులో విస్తృతంగా మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి పర్యటిస్తూ పరిశీలించారు. కాలనీలలోని మురుగునీరు కాలువలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల చుట్టూ, ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి,దోమల ఉత్పత్తిని అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.తాగునీరు కలుషితం కాకుండా చూడటం,క్లోరినేషన్ చేయడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని నిరోధించాలి అని అన్నారు అదేవిధంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉన్నారు. అదేవిధంగా ఆయా కాలనీలలో రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించారు.ఓపెన్ ప్లేస్ లో ఉన్న చెత్తచెదారాలను వెంటనే తొలగించాలని సంబంధిత శానిటేషన్ అధికారులకు తెలిపారు.శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వార్డులో ఉన్న ప్రతి వీధిలో చెత్తాచెదారాలు తీయించి, బ్లీచింగ్ . దోమలు నివారణకు మరియు అంటు రోగాలు ప్రబలకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపట్టామని కమిషనర్ తెలిపారు. ప్రతిరోజు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వార్డులను, కాలనీలను పర్యటిస్తూ ప్రజలకు సూచనలిస్తూ, మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పారిశుధ్య పనులలో భాగస్వాములు కావాలి అని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# రైతులకు 513 పాస్ బుక్కులు పంపిణీ

## :ఎమ్మెల్యే గిత్త జయ సూర్య

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు మార్చి 2 :**



నందికొట్కూరు నియోజకవర్గంపగిడ్యాల మండలం నెహ్రూ నగర్ గ్రామం లో మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్త ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు 513 పట్టాదారు పాస్ బుక్ పంపిణీ చేయడం జరిగిందిఈ సందర్భంగా మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో పబ్లిసిటీ పిచ్చితో జగన్మోహన్ రెడ్డి పాసుబుక్కుల మీద సర్వే రాళ్లపై ఎక్కడపడితే అక్కడ ఆయన బొమ్మ వేసి ప్రజల సొమ్ము వృధా చేశారు అని కానీ మన ప్రభుత్వం పట్టా పాస్ బుక్కు మీద రాజముద్ర వేసి అందించిందని, అన్నారు గత ప్రభుత్వంలో నందికొట్కూరు లో ప్రభుత్వ భూములు కనబడితే చాలు కబ్జాలు చేసేవారు అని, అన్నారు నెహ్రూ నగర్ గ్రామంలో 418.179 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని తెలుసుకొని అది ప్రజల కోసం అని పేరు పేర్కొన్నారు.అనంతరం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిది సిఎంఆర్ఎఫ్ ద్వారా నెహ్రూ నగర్ గ్రామానికి చెందిన పల్లె శ్రీనివాసులు రూ 144562/-లు మంజూరైన చెక్కును లబ్ధిదారునికి పంపిణీ చేయడం జరిగిందిఅనంతరం నెహ్రూ నగర్ సచివాలయం 2ను తనిఖీ చేయడం జరిగింది సచివాలయంలో నిర్వహణ సరిగా లేకపోవడంతో మరియు హాజరు పట్టికను పరిశీలించారు హాజరు సరిగా లేకపోవడంతో సచివాలయం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మహేశ్వర్ రెడ్డి గ్రామ సీనియర్ నాయకులు లోకానంద రెడ్డి రామిరెడ్డి గంగన్న, జున్ను రామిరెడ్డి, స్వరూపు పాతకోట రమణ మండల నాయకులు,కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఒక వరం ఎమ్మెల్యే గిత్త



**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు మార్చి 2 :**

నందికొట్కూరు నియోజకవర్గం జూపాడుబంగ్లా మండలం ముఖ్యమంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా తాటిపాడు గ్రామానికి చెందిన షేక్ షాల్మియాకి 20350/- రూపాయలు మరియు దీపిక కి 30028/- రూపాయలు మంజూరైన చెక్కులను కూటమి నాయకులతో కలిసి వారి ఇంటికి వెళ్లి పంపిణీ చేసిన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఈ కార్యక్రమంలో మండల నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు పాల్గొనడం జరిగింది.ం

# పెరవలి రంగనాథ స్వామి రథోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

**మద్దికేర: ఉత్తేజిత న్యూస్:**




మద్దికేర మండల పరిధిలోని గల పెరవలి గ్రామం నందు వెలిసిన శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి రథోత్సవం సందర్భంగా 8వ తేదీన ఆదివారం రోజున ఉదయం 6 గంటలకు గ్రామ ప్రజలు, రంగనాథ స్వామి భక్తుల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. బండలాగుడు పోటీలలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి 60,000 (దాతలు పారా రామచంద్ర ప్రసాద్ 20000,పోతుల పురుషోత్తం చౌదరి 10000,రామాంజనేయులు యాదవ్ మరియు పులిశేఖర్ యాదవ్ 10000, బోయిని సోమన్న కుమారుడు రామాంజనేయులు 10000,కొనకొండ రామకృష్ణ కుమారుడు రంగడు 10000),రెండవ బహుమతి 50,000 (పులి శేఖర్ రెడ్డి హమాలీలు తలారి రంగస్వామి 20000,పులి శేఖర్ రెడ్డి 10000, రామలింగారెడ్డి 10000,మెడికల్ స్టోర్ తిమ్మప్ప 5000,ఈడిగ దస్తగిరి గౌడ్ 5000), మూడవ బహుమతి 40,000 శ్రీ రంగనాథ స్వామి దేవాలయం వారు,నాలుగవ బహుమతి 30000 అంబేద్కర్ సర్కిల్ ఎస్సీ కాలనీ ప్రజలు,ఐదవ బహుమతి 20,000 2001--2002 ఎస్ఎస్సి బ్యాచ్,ఆరవ బహుమతి 15000 గోడ కింద రామాంజనేయులు,ఏడవ బహుమతి 10000 తలారి వాల్మీకి 5000,తలారి రామాంజనేయులు 5000,ఎనిమిదవ బహుమతి 8000 కనకదాసు ట్రాక్టర్స్ యూనియన్,తొమ్మిదవ బహుమతి 5000 సర్పంచ్ కారుమంచి మల్లికార్జున లు గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులను ప్రధానం చేస్తారని వివాహకులు తెలియజేశారు. వృషభ యజమానులు నిబంధనలకు కట్టుబడి ఉండాలని నిర్వాహకులు తెలియజేశారు. కావున ఆసక్తిగల వృషభ యజమానులు ఎంట్రీ ఫీజు 500 రూపాయలు చెల్లించి ఎనిమిదవ తేదీలోపు తమ పేరును నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలియజేశారు.

# అనిశ్చితిలో ఇరాన్ భవితవ్యం

అమెరికా యుద్ధ దాహానికి ప్రపంచం వణుకుతోంది. బడిత ఉన్నోడిదే బర్రె అన్నచందంగా అమెరికా తన ఆయుధాలతో ప్రపంచాన్ని బెదిరిస్తోంది. దారికి రాని వారిపై దాడికి తెగిస్తోంది. మొన్న వెనిజువెలా, ఇప్పుడు ఇరాన్ దేశాలు దెబ్బతిన్నాయి. ప్రపంచ దేశాల్లో అస్థిరతను సృష్టించడం, తమ దారికి తెచ్చుకోవడం అలవాటుగా చేసుకుంది. ఆయుధాలు లేదా, సుంకాలతో బెదరిస్తోంది. భారత్‌ను కూడా ఇదే తరహాలో ఇబ్బందులు పెడుతోంది. తాజా యుద్ధంతో భారత్ తన వ్యూహాలను మార్చుకోవాలి. స్వతహాగా ఆలోచన చేయాలి. గతంలో ఇరాక్‌ను ధ్వంసం చేసిన అమెరికా ఇప్పుడు ఇరాన్‌ను తుదముట్టిం చింది. రేపు ఎవరన్న ప్రశ్న ఉదయిస్తోంది. ఇది నయా నియంతల కాలంగా మారింది. ఓ వైపు అమెరికా, మరోవైపు ఇజ్రాయిల్ కలసి ఆడుతున్న యుద్ధంలో ప్రపంచ దేశాలకు వణుకు పుట్టేలా ఉంది. అయితే ఇరాన్ కూడా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా హమాస్, హిజ్బుల్ సంస్థలను ప్రోత్సహించి ఇజ్రాయిల్ పతనాన్ని కోరుకుంది. ఇరాన్‌ను అభివృద్ధి చేసుకునే పనిని వదిలి ఇజ్రయిల్‌తో పంతం పెట్టుకుంది. అణు కార్యక్రమాలను విస్తరించుకుంది. అదే ఇప్పుడు ఖమేనీ పతనానికి దారితీసింది. దశాబ్దాల పాటు తిరుగులేని రీతిలో ఇరాన్‌ను శాసించిన అగ్ర నాయకుడు ఖమేనీ..ప్రత్యర్థి దాడిలో సులువుగా ప్రాణాలు కోల్పోవడం ఆశ్చర్యపరయడం లేదు. ఎందుకంటే కొన్ని నెలలుగా ఖమేనీ కదలికలపై దృష్టి పెట్టిన అమెరికా, ఇజ్రాయెల్ మట్టుపెట్ట గలిగాయి. ఆధునిక సాంకేతికతో ఖమేని ప్రాంతాన్ని గుర్తించి దాడి చేసారు. అమెరికా దాడులు దాదాపు ఖాయమని కొద్ది రోజులుగా స్పష్టమవుతున్నా ఆయనను సురక్షితంగా ఉంచడంలో అక్కడి అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అయ్యింది. అమెరికా అందించిన రహస్య సమాచారం ఆధారంగా ఇజ్రాయెల్.. శనివారం మెరుపు వేగంతో స్పందించి దాడికి దిగడంతో తప్పించుకోవడానికి ఖమేనీకి అవకాశం దక్కలేదు. తమ అణు కేంద్రాలను తొలుత లక్ష్యంగా చేసుకోవచ్చని ఇరాన్ నిఘా వర్గాలు భావించాయి. కానీ తొలి దాడి నేరుగా ఖమేనీపైనే జరుగుతుందని ఊహించలేకపోయాయి. ఈ క్రమంలో ఇరాన్ భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ఇరాన్ తన ఛాందసవాద పంథాను వీడాలి. ఉగ్రవాదులను ప్రోత్సహించి, ఇతర దేశాలపై పురిగొల్పే విధానాల నుంచి తప్పుకోవాలి. ప్రజలంతా ఎవరికి తోచినట్లు వారు బతికేలా చేసుకోవాలి. పాకిస్తాన్ కూడా ఇలాగే ఉగ్రవాదులను ఎగదోస్తూ వచ్చింది. చివరకు సహనం నశించిన భారత్ ఆపరేషన్ సిందూర్‌తో దాడులు చేసింది. అయితే చావుతప్పి కన్ను లొట్టపోయి నట్లుగా ఇప్పుడు పాక్ పరిస్థితి మారింది. అఫ్గాన్‌తో కయ్యానికి దిగింది. ఇది దేశాన్ని అతలాకుతలం చేస్తుందన్న విషయం గుర్తించడం లేదు. ఇక ఇరాన్ కూడా ఛాందసవాద భావాలతో రగిలిపోతోంది. ఖమేనీ రాకతో ఇరాన్ మళ్లీ మతఛాందసవాదంలోకి నెట్టబడింది. అక్కడ ప్రజలు ఇటీవలే ఖమేనీ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ప్రభుత్వ దాడుల్లో వేలాదిమంది హతం అయ్యారు. అంతర్గతంగా కూడా ఇరాన్ నాయకత్వం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో అమెరికా కూడా పాచిక వేసి ఖమేనీని మట్టు పెట్టింది. గత ఏడాది ఇరాన్‌లోని అణు స్థావరాలపై దాడికి సన్నద్ధమవుతున్న తరుణంలోనే.. ఖమేనీ ఎక్కడ దాగున్నారో తమకు తెలుసని, కావాలనుకుంటే ఆయనను చంపగలిగి ఉండేవారమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. నాటి నుంచి ఈ పటిష్ట నిఘా నెట్‌వర్క్‌ను అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ కొనసాగించింది. గత ఏడాది 12 రోజుల యుద్ధం సమయంలోనే ఖమేనీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ దళం మధ్య కమ్యూనికేషన్ సాగుతున్న తీరు, అత్యవసర సమయాల్లో వారు చేపడుతున్న చర్యల గురించి మరింత ఎక్కువగా తెలుసుకుంది. ఆ సమాచారం ఆధారంగా తన నిఘా సామర్థ్యానికి సీఐఏ పదును పెట్టింది. తద్వారా.. ఖమేనీ కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించడం, తదుపరి అడుగుల గురించి మరింత కచ్చితత్వంతో అంచనాలు వేయగలిగే సత్తాను సాధించింది. ఖమేనీ కదలికలపై అత్యంత విశ్వసనీయ సమాచారాన్ని సీఐఏ.. ఇజ్రాయెల్‌తో పంచుకుంది. ఆ వెంటనే ఇంటెలిజెన్స్, సైనిక ప్రణాళికపై కసరత్తు మొదలైంది. ఖమేనీ భేటీ శనివారం సాయంత్రం ఉండొచ్చని తొలుత అమెరికా, ఇజ్రాయెల్ దళాలు భావించాయి. అయితే ఆ సమావేశం ఉదయమే జరుగుతున్నట్లు చివరి నిమిషంలో ఇజ్రాయెల్ నిఘా అధికారులకు సమాచారం అందింది. దీంతో శనివారం ఉదయమే టెహ్రాన్‌పై విరుచుకుపడాలని నిర్ణయించు కున్నారు. ఖమేనీపై దాడితో యుద్ధాన్ని ప్రారంభించాలని తీర్మానించుకున్నారు. పోరు మొదలయ్యాక ఆయన బంకర్‌లో తలదాచుకోవచ్చన్న భావనకు అమెరికా, ఇజ్రాయెల్‌లు వచ్చాయి. ఆ సమయంలో ఇరాన్ జాతీయ భద్రతా అధికారులు ఒక భవనంలో.. ఖమేనీ మరో భవనంలో ఉన్నారు. అయినా ఇరాన్ సుప్రీం నేత నిర్దిష్ట ప్రదేశాన్ని గుర్తించిన జెట్‌లు అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాయి. ఖమేనీ ప్రాంగణం ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రాలు నిర్ధారించాయి. దానిపై 30 బాంబులను ప్రయోగించి నట్లు తెలుస్తోంది. ఖమేనీపై దాడికి శక్తిమంతమైన 'బంకర్ బస్టర్' బాంబులను కూడా వాడినట్లు వార్తలు వస్తున్నాయి.

# కువైట్‌లో కూలిన అమెరికన్ ఫైటర్ జెట్

కువైట్: అమెరికా సైనిక యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు ఇరాన్ తెలిపింది. అమెరికా ఎఫ్–15 యుద్ధ విమానం కువైట్ గగనతలంలో కూలిపోయింది. విమానం కూలిపోయే ముందు పైలట్ విమానంలో నుండి బయటకు వెళ్లాడని అంతర్జాతీయ మీడియా నివేదిస్తోంది. పైలట్ స్వల్పంగా గాయపడినట్లు సమాచారం. విమాన ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు విడుదలయ్యాయి. విమానం మంటల్లో చిక్కుకుని పడిపోతున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. ఇరాన్ ఒకేసారి ఇజ్రాయిల్, గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా వైమానిక స్థావరాలపై క్షిపణులను ప్రయోగించడం ద్వారా తన దాడులను కొనసాగిస్తోంది. కువైట్ ఇంటిగ్రేటెడ్ పెట్రోలియం ఇండస్ట్రీస్ కంపెనీ సోమవారం విమానం శిథిలాలు మినా అల్ అహ్మది శుద్ధి కర్మాగారంలోకి పడ్డాయని ధృవీకరించింది. ఇద్దరు కార్మికులు గాయపడ్డారని కిపిక్ తెలిపింది. ఈ ప్రాంతంలో మోహరించిన ఎంఐఎం–104 పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థ ద్వారా విమానం ప్రమాదవశాత్తూ కూలిపోయిందని అనుమానిస్తున్నారు. పేట్రియాట్ అనేది బాలిస్టిక్ క్షిపణులు, శత్రు విమానాలను కూల్చివేసేందుకు సాధారణంగా ఉపయోగించే అధునాతన వ్యవస్థ. ఇజ్రాయెల్‌తో పాటు అమెరికా వైమానిక స్థావరాలున్న గల్ఫ్ దేశాలపై కూడా క్షిపణి దాడులకు దిగింది. యూఏఈ, కువైట్, బహ్రెయిన్, ఖతార్ తదితర దేశాల్లోని అమెరికా బేస్‌లపై దాడులు చేసింది. కాగా, సోమవారం శత్రు దేశానికి చెందిన ఓ ఫైటర్ జెట్‌ను కూల్చివేసినట్టు ఇరాన్ ప్రకటించింది. కువైట్ గగనతలంలో ఎగురుతున్న ఒక ఎఫ్–15 ÷టైర్ జెట్‌ను తమ క్షిపణి వ్యవస్థతో కూల్చివేసినట్లు వెల్లడించింది. దీనికి సంబంధించిన వీడియోను కూడా ఇరాన్ విడుదల చేసింది. వైరల్ అవుతున్న ఆ వీడియో ప్రకారం.. ఓ యుద్ధ విమానం మంటల్లో చిక్కుకుని నెమ్మదిగా కిందకు పడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. అయితే ఈ విమానం అమెరికాదా లేక ఇజ్రాయెల్‌దా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. పైలట్లు ఇద్దరు పారాచూట్ల సాయంతో క్షేమంగా బయటపడినట్లు వార్తలు వస్తున్నాయి. అలాగే, ఈ యుద్ధం ఆపేందుకు మధ్యవర్తులతో ఇరాన్ సంప్రదింపులు జరుపుతోందంటూ వస్తున్న వార్తలను ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీ ఖండించారు. అమెరికాతో చర్చల ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పశ్చిమాసియాలో ఉద్రికత్తలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఇరాన్, అమెరికా మద్దతు కలిగిన ఇజ్రాయెల్ మధ్య దాడులు, ప్రతిదాడులు మూడో రోజుకు చేరుకున్నాయి. యుద్ధం ప్రారంభమైన మొదటి రోజే ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఖమేనీ మృతికి ప్రతీకారంగా ఇరాన్ కూడా దాడులు ప్రారంభించింది

# బాణాసంచా తయారీ కేంద్రంలో విస్ఫోటనం

కాకినాడ: కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలంలోని బాణసంచా తయారీ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. వేట్లపాలెం పరిధి గోదావరి కెనాల్ పక్కన ఉన్న సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 20 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. భారీ ఎత్తున మంటలు ఎగసిపడడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. పేలుడు శబ్దాలు సుమారు 5 కిలోమీటర్ల మేర వినిపించాయని స్థానికులు తెలిపారు. శబ్దం తీవ్రతకు పక్క గ్రామంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో శ్లాబ్‌కు పగుళ్లు వచ్చాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలు ఆర్పేందుకు 2 ఫైర్ ఇంజిన్ల సాయంతో రంగంలోకి దిగారు. తీవ్రంగా గాయపడిన 8 మందిని అంబులెన్స్‌లో స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలే ఉన్నట్లు సమాచారం. బాణసంచా పరిశ్రమను అడపా నాని కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పరిమితికి మించి బాణసంచా తయారు చేయడం వల్లే ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు సంభవించినప్పుడు భారీ శబ్దం వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు ధాటికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఐదు గ్రామాల పరిధిలో దట్టమైన పొగలు అలముకున్నాయి. పేలుడు సంభవించే ప్రాంతానికి స్థానికులు చేరుకున్నప్పటికే అందులో చిక్కుకున్న పలువురు అగ్నికి ఆహుతయ్యారు. ఘటనాస్థలిలో శరీరభాగాలు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా కాలిపోయాయి. మృతుల్లో ఇప్పటి వరకు 11 మందిని పోలీసులు గుర్తించారు. మృతులను అడబాల శ్రీను, కడింపల్లి కృపమ్మ, కడింపల్లి ధనరాజు, సాధనాల సత్యవేణి, వట్లూరి రవి, మందపల్లి చిన్ని, నిమ్మద కరుణ, గంపల మంగ, గొడతా మహేశ్, గొడతా రాము, గొడతా నానిగా పోలీసులు పేర్కొన్నారు. ఇంకా కొద్ది మంది మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. టపాసులు తయారు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు సమాచారం. పేలుడు ధాటికి మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. అలాగే ఈ ప్రమాదంలో అనేమంది కార్మికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. పేలుడు సమయంలో మొత్తం 30 మంది కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. పేలుడుతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలముకుంది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. మృతుల్లో ఎక్కువమంది మహిళలు ఉన్నారు. పేలుడు శబ్దం విని స్థానికులు భారీగా అక్కడకు చేరుకుని
సహాయక చర్యలు చేపట్టారు. ఘటనాస్థలిలో మృతుల బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి.



## పేలుడు ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి

విజయనగరం:కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాద ఘటనపై ఆరా తసిన సిఎం అధికారులతో మాట్లాడారు. విజయనగరం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రికి ప్రమాద ఘటన గురించి అధికారులు తెలియజేశారు. దీంతో విజయనగరం నుంచే ఉన్నతాధికారులతో సీఎం మాట్లాడారు. ప్రమాదానికి కారణాలు... ప్రస్తుతం అక్కడ అందుతున్న సహాయక చర్యలపై ఆరా తీశారు. ప్రమాదం జరిగిన సూర్య ఫైర్ వర్క్స్‌లో 20 మంది వరకు పని చేస్తున్నారని అధికారులు తెలియజేశారు. బాణసంచా తయారీదారులు ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి విచారం వ్యక్తం చేశారు. మంత్రులు, ఉన్నతాధికారులు ఘటనాస్థలానికి వెళ్లాల్సిందిగా సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రమాదంపై సామాజిక మాధ్యమం ఎక్స్‌లోనూ స్పందించారు సీఎం. బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. బాధితులకు అవసరమైన తక్షణ సాయం అందించాలని ఆదేశించామని చెప్పారు. సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నామని.. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

బాధితులకు అవసరమైన తక్షణ సాయం అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఘటనాస్థలంలో అధికారులు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. పేలుడు ఘటనలో బాధిత కుటుంబాలను ఆదుకుంటామని చంద్రబాబు తెలిపారు. బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనపై హోం మంత్రి అనిత స్పందించారు. కార్మికుల మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో సీఎం పర్యటన సందర్భంగా అక్కడ ఉన్న ఆమె.. హుటాహుటీన సంఘటన స్థలికి బయల్దేరి వెళ్లారు. కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఎప్పటికప్పుడు మాట్లాడి ఘటనపై ఆరా తీశారు. బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సమాచారం తెలిసి తీవ్ర దిగ్భ్రాతికి గురయ్యాను. పలువురు మృత్యువాత పడటం మాటలకు అందని విషాదం. మృతులకు నివాళులు అర్పిస్తున్నాను. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం
ఆదుకుంటుంది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తాం అని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పేలుడు ఘటనపై ఇంఛార్జి మంత్రి నారాయణ తీవ్ర దిగ్భ్రాత్రి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అత్యవసర చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఘటనాస్థలికి వైద్యులను పంపించి తక్షణ వైద్యసాయం అందించాలని ఆదేశించారు.



# 27నుంచి ఒంటిమిట్ట వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుమల: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను ఈవో ఎం.రవిచంద్రతో కలిసి తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆవిష్కరించారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో శనివారం బోర్డు సమావేశం అనంతరం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్
మాట్లాడుతూ.. మార్చి 27 నుంచి ఏప్రిల్ 5 వరకు ఒంటిమిట్ట శ్రీ కోందండరామాలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 1న రాష్ట్ర పండుగగా శ్రీ సీతారాముల కల్యాణాన్ని తితిదే అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు వి.వీరబ్రహ్మం, డా.ఎ.శరత్, సీవీఎస్వో మురళీకృష్ణ, పలువురు బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి అనుగ్రహంతో శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సకల ఐశ్వర్యాలు సమకూరాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ధర్మ ప్రచారంలో భాగంగా తితిదే ప్రతి ఏడాది ఉగాది నాటికి పంచాంగాలను ముద్రించి అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రాబోయే శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగాన్ని ఆకర్షణీయంగా ముద్రించింది. పంచాంగాన్ని తితిదే ఆస్థాన సిద్దాంతి తంగిరాల వేంకటకృష్ణ పూర్ణ ప్రసాద్ సిద్దాంతి రచించారు. రాజాధి నవనాయకుల ఫలితాలతోపాటు రాశిఫలాలు, వధూవర గుణమేళనం, వివాహాది సుముహూర్త నిర్ణయాలు, తితిదేలో నిర్వహించే విశేష ఉత్సవాలు తదితర విషయాలను చక్కగా వివరించారు.

# శ్రీవారి ముడుపు పత్రం పథకం' ప్రారంభం



తిరుమల,ఫిబ్రవరి28(ఆర్ఎన్ఎ): టీటీడీ 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.5,456.26 కోట్ల బ్జడెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపిందని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ బడ్జెట్‌కు ఆమోదం తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.తిరుమల అన్నమయ్య భవనంలో ఈవో ఎం.రవిచంద్రతో కలసి శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో టీటీడీ బోర్డు సబ్ కమిటీ సిఫార్సుల మేరకు టీటీడీ చరిత్రలో తొలిసారిగా తిరుమల తిరుపతి దేవస్థానం విద్యా సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో మెరుగైన విద్యను అందించేందుకు గాను రూ.118.89 కోట్లు కేటాయింపు చేశారు.. ఇందులో భాగంగా డిజిటల్ క్లాస్ రూములు, అదనపు హాస్టల్ బ్లాకులు, వంట గదుల ఆధునీకరణ, ఇతర మౌళిక సదుపాయాలు వంటి సమూలమైన మార్పులను తీసుకొచ్చేందుకు ఆమోదం ఇచ్చింది. భక్తుల విజ్ఞప్తి మేరకు శ్రీవారికి ముడుపులు అందించే దాతల సౌకర్యార్థం 'శ్రీవారి ముడుపు పత్రం పథకం' ను ప్రయోగాత్మకంగా ప్రారంభించాలనే నిర్ణయం తీసుకున్నాం. ప్రస్తుతం భక్తులు మొక్కుల రూపంలో శ్రీవారి హుండీలో కానుకలు వేస్తున్నారు. ఇందుకు బదులుగా భక్తులు తిరుమలలో ఏర్పాటు చేసే కౌంటర్లలో చెల్లింపులు చేస్తే అందుకు తగిన ముడుపు పత్రాలు అందజేస్తారు. వాటిని నేరుగా శ్రీవారి హుండీలో వేయవచ్చు. తద్వారా భక్తులు నగదు, నాణెళిలు తీసుకువచ్చేందుకు ఉన్న ఇబ్బందులు తొలగుతాయి. తిరుమలలో భక్తుల సౌకర్యార్థం అదనంగా మరో అన్న ప్రసాద భవనం, ఆధునిక వంటశాలను అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించేందుకు రిలయన్స్ సంస్థ రూ.100 కోట్ల నుండి రూ.120 కోట్లు విరాళం అందించేందుకు ముందుకు రావడంతో పనులు ప్రారంభించేందుకు ఆమోదం ఇచ్చారు. ఆలయాలు, ప్రాకారాలు, రాజ గోపురాలు తదితర నిర్మాణాలకు అయ్యే ఖర్చును దృష్టిలో ఉంచుకుని తదనుగుణంగా శ్రీవాణి ట్రస్టు మార్గదర్శకాలను మార్పు చేసేందుకు ఆమోదం ఇచ్చారు. ఒంటిమిట్టలో 108 అడుగుల జాంబవంతుడి విగ్రహం ఏర్పాటుకు గాను డ్రై ఐల్యాండ్ నిర్మించేందుకు నిర్ణయం. అందుకుగాను రూ.20.17 కోట్లతో పనులకు ఆమోదం. కోయంబత్తూర్, గువహటి, బెలగావి, అదేవిధంగా పాట్నా వద్ద మోకామ నగరంలో శ్రీవారి ఆలయాల నిర్మాణాలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు టీటీడీకి కేటాయించిన భూమిని తీసుకునేందుకు ఆమోదం. వకుళమాత ఆలయంలో అక్షర గోవిందం పేరుతో అక్షరాభాస్య కార్యక్రమం ప్రారంభించాలని నిర్ణయం. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 1వ తేదీన జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి విచ్చేసే దాదాపు 70 వేల మంది భక్తులకు ఈ ఏడాది అదనంగా రూ.50 విలువ చేసే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా అందించాలని నిర్ణయించాం. గత ఏడాది తలంబ్రాల ప్యాకెట్ కిట్‌ను అందించిన విషయం తెలిసిందే. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భక్తులను ఆకట్టుకునేలా రూ. 4.25 కోట్లతో విద్యుత్ అలంకరణలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఎల్ఈడి బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.ఆర్మీ వెల్ఫేర్ ప్లేస్ మెంట్ ఆర్గనైజేషన్ ద్వారా తిరుపతిలో 356 మంది, తిరుమలలో 371 మంది భద్రత సిబ్బంది నియామకానికి ఆమోదం. అలిపిరి తనిఖీ కేంద్రంలో రూ.8 కోట్లతో ఎక్స్ రే బ్యాగేజ్ స్కానర్లు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటుకు ఆమోదం. తిరుమల, తిరుపతిలోని టీటీడీ గోశాలలు, పలమనేరు లోని శ్రీవేంకటేశ్వర ఇంక్యూబేషన్ సెంటర్ లలో రూ.11.28 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం. టీటీడీ ఆలయాల్లో పరిచారకులుగా పని చేస్తున్న 51 మందికి అర్చకులుగా పదోన్నతి కల్పించేందుకు గాను ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయం. పార్వతీపురం మన్యం జిల్లాలో శ్రీ వేంకటేశ్వర దివ్య క్షేత్రం నిర్మాణానికి రూ.14.25 కోట్లు కేటాయింపు. తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆలయం చుట్టూ సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు ఆమోదం. టీటీడీ ఆలయాలు, సత్రాలు, విశ్రాంతి భవనాలు, యాత్రికుల వసతి సముదాయాలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, కల్యాణ మండపాల భద్రతను పర్యవేక్షించేందుకు తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో రూ.10.75 కోట్లతో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం. ఇటీవల చాలామంది తమ స్వప్రయోజనాల కోసం తిరుమలలో అసత్య కథనాలతో రీల్స్ చేసి సోషియల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ఎంతో భక్తితో తిరుమల పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల మనోభావాలను దెబ్బతినేలా పోస్టు పెట్టేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ హెచ్చరిస్తోంది. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు వి.వీరబ్రహ్మం, డా.ఎ.శరత్, సివిఎస్వో మురళికృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలు అండగా ఉన్నారు

**ప్రజలకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం**

**పారిశ్రామికీకరణలో తెలంగాణ ఆదర్శం కావాలి**

**ప్రతి ప్రభుత్వ ఆఫీస్‌కు సొంత భవనం ఉండాల్సిందే**

**పాత పద్ధతి నుంచి..సాంకేతికంగా అప్‌డేట్ కావాల్సిందే**

**ఆన్‌లైన్ విధానంలో అన్ని పనులు జరిగేలా చూడాలి**

**నిర్ణీత సమయంలో ఫైళ్లు క్లీయర్ చేయాల్సిందే**

**99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై అధికారులతో చర్చ**

**ఫ్యూచర్ సిటీపై దృష్టి పెట్టి పనిచేయండి**

**అధికారులకు దిశానిర్దేశం చేసిన సిఎం రేవంత్**



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సచివాలయంలో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమావేశంలో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. మార్చి నుంచి జూన్ వరకు 99 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ అధికారులు పాల్గొన్నారు. మార్చి 4 న జరిగే కలెక్టర్ల సమావేశంలో అందరి పని తీరుపైన మాట్లాడుతానని అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక పేరు తో 99 రోజుల కార్యాచరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేక లోగో తయారు చేస్తున్నాం..కేంద్రం ఏర్పాటు చేసిన ఏ ఐ సమావేశం నిర్వహణ పైన కొన్ని విమర్శలు వచ్చాయి..కానీ తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ అందరి దృష్టిని ఆకర్షించిందన్నారు. ప్రణాళికా బద్ధంగా జీహెచ్ ఎం సీ ని మూడు కార్పొరేషన్ లు గా విభజించాం..కోర్ అర్బన్ రీజియన్ లో చేపట్టాల్సిన కార్యాచరణ పైన అధికారులు దృష్టి పెట్టాలి..ఫ్యూర్ అర్బన్ రీజియన్ 10 వేల చదరపు కిలో మీటర్ల పరిధిలో విస్తరించి ఉంది..ఇక్కడ మాన్యుఫాక్చరింగ్ రంగం విస్తరించాలి. పారిశ్రామికీకరణ లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా ఉండాలని అంటూ.. దీనిపైన అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సేవా రంగంలో వస్తున్న పెను మార్పులు గమనంలోకి తీసుకోవాలి..శాఖలపైన ప్రతి ఒక్కరికి సంపూర్ణ అవగాహన ఉండాలి.. శాఖలల్లో పనిచేస్తున్న ఉద్యోగులు,అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జాబితా సిద్ధం చేయాలి..ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండడానికి వీలు లేదు.. ప్రతి శాఖకు సొంత భవనం ఉండాలి..బడ్జెట్ ప్రతిపాదన లో వీటిని చేర్చాలి. కేంద్ర ప్రాయోజిత పథకాల పైన ప్రతి శాఖ దృష్టి పెట్టాలి..అధికారులు అప్రమత్తం గా ఉండాలి సర్వీస్ సెక్టార్ ను పూర్తి గా ప్రక్షాళన చేయాలి..ఆన్‌లైన్ విధానంలో అన్ని పనులు జరిగేలా చూడాలని సూచించారు. ఫైల్ విధానం ఉండాలి..నిర్ణీత సమయంలో ఫైల్ క్లియర్ కావాల్సిందే. వివిధ కంపెనీ లతో చేసుకున్న ఒప్పందాలు ,పెట్టుబడులు గ్రౌండ్ కావాలి.. పాత కాలం సర్వర్ లను అప్డేట్ చేసుకోవాలి..
సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి..ఇందులో సాంకేతికత ను వినియోగించుకోవాలి
నిజమైన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందాలి. 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ పైన దృష్టి పెట్టాలి..ఫ్యూచర్ సిటీ దేశ ఆర్థిక స్థితిని ని మార్చబోతోంది..మూసీ నది పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నాం ..ఇక్కడ వచ్చే మార్పులను ప్రజలకు వివరించాలి.డిజిటల్ గవర్నెన్స్ పైన దృష్టి పెట్టాలి..నాణ్యమైన విద్య ను అందించడం పైన దృష్టి సారించాలి..వంద నియోజకవర్గాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభించుకోబోతున్నాం .. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తాం..ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సేవలు మెరుగుపడాలి..ప్రాంతాల వారీగా మెడికల్ డేటా తయారు చేయాలి.ప్రతి సెక్రటరీ తమ శాఖ లల్లో బెస్ట్ ప్రోగ్రామ్ ను డిజైన్ చేసుకోవాలి.. మార్చి 6 నుంచి 99 రోజుల ప్రణాళిక జూన్ 12 వరకు జరగబోతుంది.. జూన్ 2 వరకు ప్రతి ఆఫీస్ పరిశుభ్రంగా కావాల్సిందే.. జూన్ 2 తెలంగాణ కు పండుగ..పండుగ ను అంతా ఘనంగా జరుపుకోవాలి. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రతి అధికారి ఈ కార్యక్రమం లో పాల్గొనాలి..మినహాయింపు లు ఉండవు శాఖ ల మధ్య సమన్వయం ఉండాలి.. ప్రతి ఎన్నికలో ప్రజలు నాకు కావాల్సిన బలాన్ని ఇచ్చారు.. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మనం ప్రజలకు మంచి చేయాల్సి ఉందని సిఎం రేవంత్ సూచించారు.

# మీ ప్రభుత్వంపై తిరగబడండి

**మీకు అండగా మా సైనిక శక్తి ఉంటుంది**

**ఇరాన్ ప్రజలకు ట్రంప్ సందేశం**

వాషింగ్టన్: అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై చేపట్టిన దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు. ఎన్ని హెచ్చరికలు చేసినా అణుకేంద్రాల పునర్మిర్మాణం, క్షిపణులను అభివృద్ధి చేస్తుండటంతో ఇరాన్‌పై భారీ సైనిక చర్య చేపట్టామని ప్రకటించారు. ఇరాన్ ప్రజలకు బహిరంగంగా తొలిసారి కీలక సందేశం ఇచ్చారు. దశాబ్దాలుగా అణచివేతకు గురవుతున్న ఇరాన్ ప్రజలకు ఇది విమక్తి కల్పించే సందర్భమని అన్నారు. 'ఇరాన్ ప్రజలకు విముక్తి కలిగించే సందర్భం వచ్చింది. తరతరాలకు మీకు లభించే ఏకైక గొప్ప అవకాశం ఇదే కావచ్చు. అమెరికా పూర్తి సైనిక శక్తితో అండగా నిలుస్తుంది. మేము పని పూర్తి చేసే సమయానికి మీ ప్రభుత్వాన్ని మీరు స్వాధీనం చేసుకోవాలి' అని ఇరాన్ ప్రజలకు ట్రంప్ పిలుపునిచ్చారు. ఇరాన్ భద్రతా దళాలను ఉద్దేశించి మాట్లాడుతూ, తక్షణమే వారు ఆయుధాలు విడిచిపెట్టాలని, అలాచేస్తే వారికి రక్షణ కల్పిస్తామని, తిరగబడితే మరణం తప్పదని హెచ్చరించారు. ఈ చారిత్రక ఘట్టంలో ఇరాన్ ప్రజలకు అమెరికా పూర్తి సైనిక శక్తితో అండగా ఉంటుందన్నారు. గతంలో ఏ అమెరికా అధ్యక్షుడు ఈ తరహాలో స్పందించేందుకు ముందుకు రాలేదన్నారు. కాగా, 'అపరేషన్ షీల్డ్ ఆఫ్ జూడా' పేరుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ శనివారంనాడు క్షిపణి దాడులు జరిగింది. ఈ దాడులలో రాజధాని నగరమైన టెహ్రాన్‌లో పలు ప్రాంతాలు దద్దరిల్లాయి. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ కార్యాలయం సమీపంలో దాడులు జరగడంతో కలకలం రేగింది. ఇరాన్ ప్రతిదాడికి దిగొచ్చంటూ ఇజ్రాయెల్ తన పౌరులను హెచ్చరించింది. ముందస్తుగా ఇరాన్, ఇజ్రాయెల్‌లు తమ గగనతలాలను మూసివేశాయి. మరోవైపు, ఇరాన్‌లోని భారతీయ పౌరులకు అక్కడి ఇండియన్ ఎంబసీ
కీలక సూచనలు చేసింది. అప్రమత్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలు పెట్టుకోవద్దని, ఇళ్లల్లోనే ఉండాలని సూచించింది. అధికారుల సూచనలను తూచా తప్పకుండా పాటించాలని కోరింది.

# ఇరాన్‌పై బాంబుల వర్షం

**సురక్షిత ప్రాంతానికి ఖమేనీ తరలింపు**

టెహ్రాన్: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా యుద్ధం మొదలుపెట్టాయి. 'ఆపరేషన్ షీల్డ్ ఆఫ్ జూడా' పేరుతో ఇజ్రాయెల్ క్షిపణులు, బాంబులతో ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై శనివారంనాడు విరుచుకుపడింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ కార్యాలయం సమీపంలో దాడులు జరిగాయి. ఖమేనీ, అధ్యక్ష భవనాలే టార్గెట్‌గా ఈ మెరుపు దాడులు జరిగినట్టు చెబుతున్నారు. దాడుల సమయంలో ఖమేనీ టెహ్రాన్‌లో లేరని తెలుస్తోంది. ఇప్పటికే ఆయనను సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు చెబుతున్నారు. అయితే ఆయనను ఎక్కడకు తరలించారు, ఎప్పుడు తరలించారనే వివరాలు వెల్లడి కాలేదు. ఖమేని ఇరాన్ వదిలి వెళ్లాలని, లేదంటే విడిచిపెట్టేది లేదని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. దీంతో ఖమేనీ లక్ష్యంగానే అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు మొదలుపెట్టినట్టు కథనాలు వెలువడుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా బలగాలు పెద్దఎత్తున సైనిక చర్యకు దిగినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన 8 నిమిషాల వీడియోను ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వాషింగ్టన్ సైనిక చర్యను ఆయన సమర్థించుకున్నారు. ఇరాన్ పాలకుల నుంచి అమెరికా ప్రజలకు ఉన్న ముప్పును తప్పించేందుకే సైనిక చర్యలకు దిగామన్నారు. ఇరాన్ కార్యక్రమాలు అమెరికాకు, అమెరికా బలగాలకు, విదేశాల్లోని తమ స్థావరాలు, ప్రపంచంలోని తమ మిత్రదేశాలకు ముప్పుగా ఉన్నాయన్నారు.

# లోన్ వడ్డీ రేట్లు పెంపు..

కొత్త ఏడాదిలో మీరు హోమ్ లోన్, పర్సనల్ లోన్ వంటివి తీసుకోవాలని భావిస్తున్నారా? మీకో అలర్ట్. ఐసీఐసీఐ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ సహా మరో రెండు బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచాయి. ఆయా బ్యాంకుల్లో కొత్త వడ్డీ రేట్లు ఏ విధంగా ఉన్నాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం. రుణాలు తీసుకునే వారికి పలు బ్యాంకులు ఝలక్ ఇచ్చాయి. ఎంపిక చేసిన టెన్యూర్లపై మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేట్లు పెంచాయి. దీంతో రుణాలపై వడ్డీ రేట్లు పెరుగుతాయి. అందులో ఐసీఐసీఐ బ్యాంక్ 10 బేసిస్ పేయింట్ల మేర ఎంసీఎల్ఆర్ రేటు పెంచింది. ఆ తర్వాత పంజాబ్ నేషనల్ బ్యాంక్ 5 బేసిస్ పాయింట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియా 5 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ పెంచింది. ఈ క్రమంలో జనవరి 1, 2024 తర్వాత ఐసీఐసీఐ బ్యాంక్, పీఎన్‌బీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యెస్ బ్యాంకుల్లో లేటెస్ట్ ఎంసీఎల్ఆర్ రేట్లు ఏ విధంగా ఉన్నాయో తెలుసుకుందాం.

ఐసీఐసీఐ బ్యాంక్ లెండింగ్ రేట్లు..

ఐసీఐసీఐ బ్యాంక్ వెబ్ సైట్ ప్రకారం.. ఎంసీఎల్ఆర్ రేటును 10 బేసిస్ పాయింట్లు పెంచింది. జనవరి 1, 2024 నుంచే అమలులోకి వచ్చాయి. కొత్త రేట్ల ప్రకారం ఓవర్ నైట్ రేటు 8.6 శాతం, నెల రోజుల ఎంసీఎల్ఆర్ రేటు 8.6 శాతానికి పెంచింది. అలాగే మూడే నెలలో ఎంసీఎల్ఆర్ రేటు 8.55 శాతం నుంచి 8.65 శాతానికి పెంచింది. ఆరు నెలల ఎంసీఎల్ఆర్ రేటు 9 శాతం, ఏడాది ఎంసీఎల్ఆర్ రేటును 9.10 శాతానికి పెంచింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్.. బంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేటును 5 బేసిస్ పాయింట్లు పెంచింది. కొత్త రేట్లు జనవరి 1, 2024 నుంచే అమలులోకి తీసుకొచ్చింది.



దీంతో ఓవర్ నైట్ ఎంసీఎల్ఆర్ రేటు 8.25 శాతానికి పెంచింది. నెల రోజుల ఎంసీఎల్ఆర్ రేటు 8.30 శాతం, మూడు నెలల ఎంసీఎల్ఆర్ రేటు 8.40 శాతం, ఆరు నెలల ఎంసీఎల్ఆర్ రేటు 8.60 శాతం, ఏడాది ఎంసీఎల్ఆర్ రేటును 8.70 శాతానికి పెంచింది.

యెస్ బ్యాంక్.. యెస్ బ్యాంకులో ఎంసీఎల్ఆర్ కొత్త రేట్లు జనవరి 1, 2024 నుంచే అమలులోకి వచ్చాయి. ఓవర్ నైట్ ఎంసీఎల్ఆర్ రేటు 9.2 శాతంగా ఉంది. నెల రోజుల ఎంసీఎల్ఆర్ వడ్డీ రేటు 9.45 శాతం, మూడు నెలల ఎంసీఎల్ఆర్ రేటు 10 శాతం, ఆరు నెలల ఎంసీఎల్ఆర్ రేటు 10.25 శాతం, ఏడాది ఎంసీఎల్ఆర్ రేటు 10.50 శాతంగా ఉన్నాయి. బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ ప్రకారం.. జనవరి 1, 2024 నుంచి ఎంసీఎల్ఆర్ రేటును 5 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్లు బ్యాంక్ తెలిపింది. దీంతో ఓవర్ నైట్ ఎంసీఎల్ఆర్ రేటు 8 శాతానికి చేరింది. నెల రోజుల ఎంసీఎల్ఆర్ రేటు 8.25 శాతం, మూడు ఎంసీఎల్ఆర్ వడ్డీ రేటు 8.40 శాతం, ఆరు నెలల ఎంసీఎల్ఆర్ 8.60 శాతంగా ఉండగా.. ఏడాది ఎంసీఎల్ఆర్ రేటు 8.80 శాతంగా ఉంది.

# డీమ్యాట్ అకౌంట్ ఉందా?



ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడులు పెట్టేందుకు తప్పనిసరిగా డీమ్యాట్ అకౌంట్ ఉండాలి. అయితే, డీమ్యాట్ ఖాతా కలిగిన వారు ఈ విషయం కచ్చితంగా తెలుసుకోవాలి. అలా జరిగినట్లయితే మీ అకౌంట్ ఇనాక్టివ్ గా మారిపోతుంది. దీంతో షేర్లు కొనడం, అమ్మడం చేయలేరు. అప్పుడు ఏం చేయాలంటే?


డీమ్యాట్ అకౌంట్ లేదా ట్రేడింగ్ అకౌంట్ అనేవి స్టాక్ మార్కెట్లు, మల్టీ కమేడిటీ ఎక్స్ఛేంజీల్లో షేర్లు, సెక్యూరిటీలు కొనడం, అమ్మడం చేసేందుకు అవకాశం కల్పిస్తాయి. డీమ్యాట్ అకౌంట్ ద్వారానే ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టవచ్చు. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో ట్రేడింగ్ చేసేందుకు వీలవుతుంది. అయితే, మీ డీమ్యాట్ అకౌంట్ డార్మాంట్ గా మారిపోయే ప్రమాదం ఉంది. వరుసగా 12 నెలల పాటు మీ డీమ్యాట్ ఖాతా ద్వారా ఎలాంటి ట్రేడింగ్ జరగకపోతే మీ అకౌంట్ ఇనాక్టివ్ గా మారిపోతుంది. ఆ వివరాలు తెలుసుకుందాం. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) 2023, జూన్ 30న జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం.. ట్రేడింగ్ అకౌండ్ వరుసగా 12 నెలల పాటు ఎలాంటి ట్రాన్సాక్షన్లు చేయకుండా ఇనాక్టివ్ గా ఉంటే దానిని స్టాక్ బ్రోకర్లు డార్మాంట్ అకౌంట్ గా పరిగణిస్తారు. ఆ తర్వాత షేర్లు కొనడం, అమ్మడం వంటివి చేయలేరు. తిరిగి తమ ఖాతాను రీయాక్టివేట్ చేసుకునే వారుకు అకౌంట్ ఫ్రీజ్ లోనే ఉంటుంది. ఎన్ఎస్ఈ జారీ చేసిన ఈ సర్క్యులర్ ఇతర స్టాక్ ఎక్స్ఛేంజీలకు సైతం వర్తిస్తుంది. ట్రేడింగ్ అంటే స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి సెక్యూరిటీలను కొనుగోలు చేయడం, అమ్మడం ఉంటుంది. అందులో ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్, షేర్లు, బాండ్లు, కమోడిటీల వంటివి ఉంటాయి.

మళ్లీ ఎలా యాక్టివేట్ చేసుకోవాలి?

వరుసగా 12 నెలల పాటు ఎలాంటి ట్రాన్సాక్షన్లు చేయకపోవడం వల్ల మీ డీమ్యాట్ అకౌంట్ డార్మాంట్ అకౌంట్ గా మారిపోయినప్పుడు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తిరిగి మీ ఖాతాను రియాక్టివేట్ చేసుకోవచ్చు. అయితే, ఇది ఎన్ని రోజుల పాటు ఇనాక్టివ్ స్టేజ్ లో ఉందో దానిపై ఆధారపడి ఉంటుందని స్టాక్ బ్రోకర్స్ చెబుతున్నారు. సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ప్రకారం.. ఇందులో రెండు రకాలుగా ఉన్నాయి. మొదటిది.. మీ డీమ్యాట్ ఖాతా 12 నెలల నుంచి 24 నెలల వలకు డార్మాంట్ అకౌంట్ గా మారడం. రెండోది 24 నెలలకుపైగా మీ ఖాతా నిద్రాణం లో ఉండిపోవడం. మొదటి కేసులో.. 12 నెలల నుంచి 24 నెలల మధ్య ఉన్నట్లయితే దానిని ఈజీగానే ఇ-మెయిల్ లేదా ఫోన్ కాల్ ద్వారా యాక్టివేట్ చేసుకోవచ్చు. ఇందులో వన్ టైమ్ పాస్ట్ వర్డ్ ప్రాసెస్ సైతం అందుబాటులో ఉంటుంది. ఇది పూర్తిగా స్టాక్ బ్రోకర్, ఇన్వెస్టర్ మధ్య జరుగుతుంది. 24 నెలల తర్వాత రియాక్టివేట్ కోసం రిక్వెస్ట్ చేస్తే మాత్రం రీ-కేవైస్ చేయాల్సి ఉంటుంది. అలాగే వ్యక్తిగతంగా వెరిఫికేషన్ పూర్తి చేయాలి. ఈ ప్రక్రియను ఆన్ లైన్ ద్వారా పూర్తి చేయవచ్చు.

# క్రెడిట్ స్కోర్ చెక్ చేస్కుంటున్నారా?

లోన్ తీసుకునే వారికి, క్రెడిట్ కార్డులు పొందాలనుకున్నా.. తక్కువ వడ్డీకి రుణం కావాలన్నా.. క్రెడిట్ స్కోరు కీలక పాత్ర పోషిస్తుందన్న సంగతి తెలిసిందే. ఇది 750 కంటే ఎక్కువ ఉంటే.. మెరుగైన క్రెడిట్ హిస్టరీ ఉన్నట్లు భావిస్తారు. అయితే దీనిని ఎలా చెక్ చేసుకోవాలో చాలా మందికి తెలియదు.




ఇప్పుడు ఫోన్‌పే యూపీఐ యాప్‌లోనే క్రెడిట్ స్కోరు చెక్ చేసుకునే వీలుంది.

ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే యూజర్ల అవసరాలకు అనుగుణంగా కొత్త కొత్త ఫీచర్లు తీసుకొస్తోంది. తాజాగా క్రెడిట్ అనే ఒక కొత్త ఫీచర్ లాంచ్ చేసింది. దీంట్లో సిబిల్ స్కోరుతో పాటు క్రెడిట్ స్కోరు బిల్లు.. రుణ చెల్లింపుల సమాచారాన్ని సమర్థంగా నిర్వహించుకోవచ్చు. ఇంకా క్రెడిట్ కార్డుల నిర్వహణ, బిల్ పేమెంట్స్, రుణ వాయిదాల చెల్లింపుల వివరాల్ని కూడా ఈ ఫీచర్‌తో సమర్థంగా మేనేజ్ చేసుకోవచ్చని తెలిపింది ఫోన్‌పే. ఇప్పుడు ఈ యాప్‌లో ఉచితంగానే సిబిల్ స్కోరు చెక్ ఎలా చేసుకోవాలనే దాని గురించి తెలుసుకుందాం. ఫోన్‌పే యాప్ ఓపెన్ చేయగానే.. హోం పేజీలోనే క్రెడిట్ అనే ట్యాబ్ కనిపిస్తుంది. ఒకవేళ అది కనిపించకుంటే యాప్ అప్డేట్ చేసుకోవాలి. క్రెడిట్‌పై క్లిక్ చేస్తే.. క్రెడిట్ స్కోరు ఫర్ ఫ్రీ అనే ఆప్షన్ కనిపిస్తుంది. దాని కింద చెక్ నౌ అనే బటన్‌పై క్లిక్ చేయాలి. క్రెడిట్ స్కోరు మీకు అక్కడ కనిపిస్తుంది. ఈ స్కోరును ఎక్స్‌పీరియెన్ క్రెడిట్ బ్యూరో అందిస్తుంది. ఈ స్కోరుతో పాటు సకాలంలో పేమెంట్స్, క్రెడిట్ వినియోగ పరిమితి, క్రెడిట్ ఏజ్, క్రెడిట్ మిక్స్, లోన్ ఎంక్వైరీలు వంటి ఇతర సమాచారం కూడా చూసుకోవచ్చు.

ఈ ఫీచర్లో మేనేజ్ క్రెడిట్స్, లోన్ ప్రొఫైల్, పేమెంట్ డ్యూస్ వంటి 3 ఆప్షన్లు కనిపిస్తాయి. వీటితో క్రెడిట్ కార్డుల మేనేజ్‌మెంట్, రుణ చెల్లింపులు వంటి సమాచారం సమర్థంగా నిర్వహించుకోవచ్చని తెలిపింది ఫోన్‌పే. సంబంధిత సమాచారాన్ని ఎంటర్ చేసి ఎప్పటికప్పుడు బిల్, ఈఎంఐ పేమెంట్ స్థితి సమీక్షించుకోవచ్చు కూడా. అయితే ఫోన్‌పేలో లాగిన అయ్యాక.. ఫోన్ నంబర్.. పాన్ కార్డుతో లింక్ అయిన నంబర్ ఒకటే అయి ఉండాలి. ఇక సిబిల్ స్కోరు లోన్ రావడంలో.. క్రెడిట్ కార్డుల్ని పొందడంలో కీలకంగా వ్యవహరిస్తుంటుందన్న సంగతి తెలిసిందే. 750 ఆపైన క్రెడిట్ స్కోరు ఉంటే.. మెరుగైనదిగా భావిస్తుంటారు. అంతకంటే తక్కువ ఉంటే యావరేజ్, బిలో యావరేజ్ కేటగిరీల కింద ఉంటుంది. మంచి క్రెడిట్ స్కోరు ఉంటే ఈజీగా లోన్లు రావడమే కాకుండా.. ఎక్కువ లిమిట్‌తో క్రెడిట్ కార్డులు పొందొచ్చు. ఇంకా.. లోన్ వడ్డీ రేట్లలో రాయితీ కూడా ఉండొచ్చు. దీంతో తక్కువ వడ్డీకే రుణాలు పొందే వీలుంటుంది.

# ఆ స్కీమ్‌తో అధిక లాభం!

ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ న్యూఇయర్ గిఫ్ట్ అందించింది. తమ కస్టమర్లకు డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచింది. ఈ స్పెషల్ స్కీమ్ ద్వారా అధిక వడ్డీ రేట్లు కల్పిస్తోంది. అయితే మరో స్కీమ్ లో వడ్డీ రేటు కోత పెట్టింది. తాజా వడ్డీ రేట్ల సవరణ వివరాలు ఇప్పుడే తెలుసుకోండి.

ప్రభుత్వ రంగ దిగ్గజ బ్యాంక్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) తమ కస్టమర్లకు నూతన సంవత్సర గిఫ్ట్ అందించింది. రూ.2 కోట్ల లోపు ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరించింది. తాజాగా పలు టెన్యూర్లపై వడ్డీ రేట్లను ఏకంగా 45 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. ఇదే సమయంలో మరికొన్నింటిపై తగ్గించింది. ఈ సవరించిన కొత్త వడ్డీ రేట్లు జనవరి 1, 2024 నుంచే అమలులోకి వచ్చినట్లు వెల్లడించింది.

వడ్డీ రేట్లు పెరిగిన టెన్యూర్లు ఇవే.. పంజాబ్ నేషనల్ బ్యాంక్ తాజాగా వివిధ టెన్యూర్లపై వడ్డీ రేట్లు పెంచింది. అందులో 180 రోజుల నుంచి 270 రోజుల మెచ్యూరిటీ టెన్యూర్ పై జనరల్ కస్టమర్లకు వడ్డీ రేటు 5.5 శాతంగా ఉండగా దానిని 6 శాతానికి పెంచింది. అలాగే 271 రోజుల నుంచి ఏడాది లోపు ఉండే డిపాజిట్లపై వడ్డీ రేటును గరిష్ఠంగా 45 బేసిస్ పాయింట్లు




పెంచింది. దీంతో ప్రస్తుతం 5.80 శాతంగా ఉన్న వడ్డీ రేటు 6.25కి చేరింది. అలాగే 400 రోజుల టెన్యూర్ గల డిపాజిట్లపై వడ్డీ రేటును 45 బేసిస్ పాయింట్లు పెంచి 6.80 శాతం నుంచి 7.25 శాతానికి చేర్చింది. అయితే, ఇదే సమయంలో 444 రోజుల స్పెషల్ స్కీమ్ వడ్డీ రేట్లను తగ్గించింది. 45 బేసిస్ పాయింట్లు కోత పెట్టి ప్రస్తుతం 7.25 శాతం ఉన్న వడ్డీ రేటును 6.80 శాతానికి తగ్గించింది.

# సైన్యంలో చేరిన దొంగ.. సైలెంట్‌గా చోరీలు.. ప్రధానితో ఫోటో!



ఇజ్రాయెల్‌పై గాజా స్ట్రిప్ నుంచి ఆకస్మిక దాడి చేసిన హమాస్ మిలిటెంట్లను నామరూపాలు లేకుండా చేయాలని ఇజ్రాయెల్ సైన్యం కంకణం కట్టుకుని యుద్ధంలోకి దిగింది. అయితే ఈ యుద్ధంలో ఇజ్రాయెల్‌కు అనుకోని షాక్ ఎదురైంది. ఎందుకంటే తన సైన్యంలోనే ఓ దొంగ చొరబడ్డాడు. ఆర్మీలో పని చేస్తూనే ఆయుధాలు, మందు గుండు.. సైలెంట్‌గా ఎత్తుకెళ్లాడు. చివరికి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఇజ్రాయెల్ హమాస్ యుద్ధం 3 నెలలుగా కొనసాగుతూనే ఉంది. గాజా స్ట్రిప్‌ను అష్ట దిగ్బంధనం చేసిన ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్.. హమాస్ ఉగ్రవాదులను వెంటాడి మరీ హతమార్చుతోంది. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ చేస్తున్న చిన్న చిన్న పొరపాట్ల వల్ల.. హమాస్ చెరలో ఉన్న ఇజ్రాయెల్ సహా ఇతర దేశాల ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. మరోవైపు.. హమాస్ ఉగ్రవాదులు కూడా ఇజ్రాయెల్ సైన్యానికి అప్పుడప్పుడు ఝలక్ ఇస్తున్నారు. అయితే తాజాగా బయటికి వచ్చిన ఓ విషయం ఇజ్రాయెల్ సైన్యానికి పెద్ద షాక్‌ను ఇచ్చింది. ఇజ్రాయెల్ సైన్యంలోకి చొరబడిన ఓ దొంగ ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని ఎత్తుకెళ్లాడు. 35 ఏళ్ల రాయ్ యాఫ్రాఖ్ అనే వ్యక్తి ఇజ్రాయెల్ సైన్యం నుంచి ఆయుధాలు ఎత్తుకెళ్తూ ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్‌కు అడ్డంగా బుక్ అయ్యాడు. అతని గురించి ఆరా తీసిన ఇజ్రాయెల్ ఆర్మీ.. ఎట్టకేలకు పట్టుకుంది. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్‌లోనే పనిచేస్తున్నట్లు ఫేక్ ఐడీ కార్డ్ సృష్టించుకున్న రాయ్ యాఫ్రాఖ్.. సైన్యంలో పనిచేస్తూనే తన పని కానిచ్చాడు. ఇజ్రాయెల్ సైన్యానికి చెందిన తుపాకులు, మందుగుండు సామగ్రిని దొంగిలించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయించాలని పకడ్బందీ ప్లాన్ వేశాడు. ఈ క్రమంలోనే అక్టోబరు 7 వ తేదీన ఇజ్రాయెల్‌పై హమాస్ దాడితో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ -ఐడీఎఫ్ ఆయుధాగారం అయిన బెల్ ఆఫ్ ఆర్ట్స్‌లోకి వెళ్లేందుకు ప్రణాళికలు వేసుకున్నాడు. ముందుగా సైన్యాధికారి దుస్తులు ధరించిన రాయ్ యాఫ్రాఖ్.. సైన్యంలోకి చొరబడ్డాడు. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, రక్షణమంత్రి యోవ్ గలాంట్ హెలికాప్టర్‌లో సైన్యాన్ని కలిసేందుకు వెళ్లగా.. అదే అదనుగా భావించిన రాయ్ యాఫ్రాఖ్.. వారి దగ్గరకు వెళ్లి ఫొటోలు కూడా తీసుకున్నాడు. అతని ప్లాన్‌కు ఆ ఫొటోలు మరింత సపోర్ట్‌గా నిలిచాయి. సైన్యంలో ఉన్నతాధికారి హోదాతో ఒక ఫేక్ ఐడీ కార్డును తయారు చేసుకున్నాడు. ఇక ఇజ్రాయెల్ సైన్యంలో కీలకంగా వ్యవహరించాడు.

ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రవాదులు చేసిన దాడుల తర్వాత.. గాజాలో చేపట్టిన ఆపరేషన్‌లలోనూ పాల్గొన్నాడు. ఈ ఆపరేషన్లలో కొన్ని టీమ్‌లను ముందుండి నడిపించాడు కూడా. ఇక గాజాలో సొరంగాల్లో ఇజ్రాయెల్ సైన్యంతో కలిసి పాల్గొన్నాడు. గాయాలైన ఇజ్రాయెల్ సైనికులకు ప్రథమ చికిత్సలు కూడా చేశాడు. యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, షిన్‌బెట్ సీక్రెట్ ఏజెంట్‌గా తనను తాను ఇజ్రాయెల్ సైనికులకు పరిచయం చేసుకున్నాడు. సమయం దొరికినపుడల్లా అసాల్ట్ రైఫిళ్లు, పిస్టళ్లు, తూటాలు, మందు గుండు సామగ్రి.. స్మోక్ గ్రనేడ్లను ఎత్తుకెళ్లేవాడు. ఎవరికీ అనుమానం రాకుండా చోరీలు చేసేవాడు. వీటితోపాటు హమాస్ ఉగ్రవాదులను చంపిన తర్వాత వారి వద్ద ఉండే తుపాకులు, తూటాలను ఎత్తుకొచ్చేవాడు. అయితే ఇజ్రాయెల్ సైన్యానికి చెందిన ఆయుధాలు, మందుగుండు సామాగ్రి మాయమవడాన్ని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ పసిగట్టింది. దీంతో గత నెల 17 వ తేదీన సైనికులు, ఆయుధాలపై ఐడీఎఫ్ నిఘా పెట్టింది. ఈ క్రమంలోనే ఆదివారం రాయ్ యాఫ్రాఖ్ ఐడీఎఫ్‌కు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ విషయాన్ని టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్, ఛానల్-12 ధృవీకరించాయి. అనంతరం రాయ్ యాఫ్రాఖ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరిపింది. ఆతని ఇంట్లో భారీగా తుపాకులు, ఐఈడీలు, గ్రనేడ్లను స్వాధీనం చేసుకున్నట్లు టెల్ అవీవ్ పోలీసులు తెలిపారు. రాయ్ యాఫ్రాఖ్‌పై మోసం, దొంగతనం సహా 5 అభియోగాలు మోపినట్లు వెల్లడించారు. ఈ అభియోగాలతో రాయ్ యాఫ్రాఖ్‌కు గరిష్ఠంగా 36 ఏళ్ల జైలు శిక్షపడే అవకాశముందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అయితే తాను ఎలాంటి తప్పు చేయలేదని.. స్వచ్ఛందంగా ఇజ్రాయెల్ సైన్యంలో పని చేసేందుకే వచ్చినట్లు చెప్పుకొచ్చాడు.

# సునామీ భయాలు

సోమవారం సంభవించిన భారీ భూకంపం జపాన్‌ను చిన్నాభిన్నం చేసింది. ఆ తర్వాత వరుసగా ప్రకంపనలు చోటు చేసుకుంటుండటంతో జపాన్ వాసులు నిద్రలేని రాత్రిని గడిపారు. సోమవారం నుంచి 155 సార్లు భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక ఈ భారీ భూకంపం ధాటికి ఆస్తి, ప్రాణ నష్టం భారీగానే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు.. సునామీ రావచ్చనే హెచ్చరికలు మరింత భయాన్ని కలిగిస్తున్నాయి. కొత్త సంవత్సరం వేళ ప్రపంచం అంతా ఆనందంలో మునిగిపోతుంటే జపాన్ మాత్రం వరుస భూకంపాలతో వణికిపోయింది. సోమవారం భారీ భూకంపం ధాటికి కకావికలమైన జపాన్‌లో ఆ తర్వాత వరుసగా ప్రకంపనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఇప్పటివరకు 155 సార్లు జపాన్‌లో భూమి కంపించినట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. ఇక భూకంపం ధాటికి వేల ఇళ్లు, భవనాలు నేలకూలాయి. మరికొన్ని పాక్షికంగా ధ్వంసం అయ్యాయి. మరోవైపు.. మృతుల సంఖ్య కూడా పెరుగుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటివరకు జపాన్ భూకంపాల్లో చనిపోయిన వారి సంఖ్య 20 దాటినట్లు స్థానిక అధికారులు తెలిపారు. అయితే ఈ మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ఇక భూకంప తీవ్రత ఎక్కువగా ఉన్న సముద్ర తీర ప్రాంతం అయిన ఇషికావాలో మరణాల సంఖ్య భారీగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే జపాన్ వాతావరణ సంస్థ సోమవారం జారీ చేసిన సునామీ హెచ్చరికల తీవ్రతను తగ్గించడం కాస్త ఊరట కల్పిస్తోంది. కానీ మరోసారి భూ ప్రకంపనలు, సునామీ వచ్చే ప్రమాదం ఉందని జపాన్ వాతావరణ శాఖ తెలిపింది. ఈ హెచ్చరికల నేపథ్యంలో సముద్ర తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ఇషికావా ప్రిఫెక్చర్‌లోని పలు నగరాల్లో సునామీ అలలను స్థానిక అధికారులు గుర్తించారు. వాజిమా ప్రాంతంలో 1.2 మీటర్లు, కనజావా ప్రాంతంలో 90 సెంటీమీటర్ల ఎత్తులో అలలు ఎగిసిపడ్డట్లు తెలిపారు. ఇషికావాలో 50 కి పైగా ఇళ్లు కుప్పకూలినట్లు సమాచారం వచ్చినట్లు స్థానిక ఫైర్ కేంద్రం వెల్లడించింది. మరోవైపు వాజిమా నగర కేంద్రంలో ఉన్న ఓ భవనంలో మంటలు చెలరేగి మరో 50 స్టోర్లు, ఇళ్లకు కూడా వ్యాపించినట్లు అధికారులు తెలిపారు. తీర ప్రాంతమైన ఇషికావా, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో సోమవార సాయంత్రం 4 గంటలకు 7.6 తీవ్రతతో భూకంపాలు వరుసగా వచ్చాయని జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించింది. దీంతో జపాన్ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో రోడ్లపై పగుళ్లు ఏర్పడ్డాయి. నీటి సరఫరా పైప్‌లైన్లు దెబ్బతినడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు చెప్పారు. బుల్లెట్ రైలు సేవలు నిలిచిపోగా.. మొబైల్ నెటవర్క్‌లు కూడా ఆగిపోయినట్లు పేర్కొన్నారు.

మరోవైపు ఇషికావా ప్రిఫెక్చర్‌లోని షికా న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌లో పేలుడు సంభవించిందని న్యూక్లియర్ రెగ్యులేషన్ అథారిటీ తెలిపింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వచ్చే కరెంట్ ఆగిపోయిందని.. కానీ బ్యాకప్ సిస్టమ్‌లను ఉపయోగించుకొని 2 అణు రియాక్టర్‌లు పని చేస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు.. జపాన్‌లో సంభవించిన భూకంపం ప్రభావం దక్షిణ కొరియాను కూడా తాకిందని ఆ దేశ అధికారులు వెల్లడించారు. దక్షిణ కొరియా తీర ప్రాంతాల్లో పలు చోట్ల సునామీ అలలను గుర్తించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మరోసారి భారీ ఎత్తున అలలు ఎగిసిపడే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశాయి. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించాయి. జపాన్‌లో సోమవారం సంభవించిన భూకంపాల్లో భారీగా నష్టం సంభవించినట్లు ఆ దేశ ప్రధాని ఫుమియో కిషిదా తెలిపారు. చాలా మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. భవనాలు కూలిపోయాయని.. అగ్ని ప్రమాదాలు సంభవించినట్లు పేర్కొన్నారు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు



కొనసాగుతున్నాయని.. వాటిని స్వయంగా తానే పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కుప్పకూలిన భవనాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.

# జైలులో షాక్..



పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే పాక్ ప్రధానిగా పని చేసిన ఇమ్రాన్ ఖాన్ మరోసారి ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి మరోసారి ప్రధాని పదవిని చేపట్టాలని భావించినా.. ఆ ఆశలు అడియాశలు అయ్యే అవకాశాలు కల్పిస్తున్నాయి. మరికొన్ని రోజుల్లో జరగనున్న పాక్ జాతీయ ఎన్నికలకు సంబంధించి ఇమ్రాన్ ఖాన్ దాఖలు చేసిన నామినేషన్‌ను తిరస్కరిం చింది. ఆయన రెండు స్థానాల నుంచి పోటీ చేసేందుకు నామ పత్రాలు దాఖలు చేయగా.. ఆ రెండు పాకిస్థాన్‌లో రాజకీయ వేడి రాజుకుంటోంది. వచ్చే నెలలో జరగనున్న పాక్ ఎన్నికల్లో పోటీకి మాజీ ప్రధానులు పోటీ పడుతున్నారు. ఇప్పటికే వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ వెల్లడించారు. ఈ క్రమంలోనే ఆయన లండన్ నుంచి పాక్‌కు తిరిగి వచ్చి ఎన్నికల ప్రచార ర్యాలీల్లో పాల్గొం టున్నారు.

దీంతోపాటు గతేడాది ప్రధాని పదవి నుంచి అనర్హుడిగా ప్రకటించబడిన ఇమ్రాన్ ఖాన్ కూడా పోటీ చేస్తానని చెప్పారు. ప్రస్తుతం తోషాఖానా కేసులో జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్‌కు బిగ్ షాక్ తగిలింది. ఆయన వేసిన 2 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో ఇమ్రాన్ ఖాన్ ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అనేదానిపై సందిగ్ధం నెలకొంది. లాహోర్ (ఎన్ఏ- 122), మియావలీ (ఎన్ఏ- 89) స్థానాల నుంచి ఇమ్రాన్ ఖాన్ నామినేషన్ వేశారు. అయితే తోషాఖానా అవినీతి కేసులో దోషిగా తేలడంతో ఐదేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆయనపై పాకిస్థాన్ ట్రయల్ కోర్టు అనర్హత వేటు వేసింది. అయితే ఈ తీర్పును ఇమ్రాన్ ఖాన్ ఇస్లామాబాద్ హైకోర్టులో అప్పీల్ చేయగా.. దానిపై స్టే విధించింది. అయితే తోషాఖానా కేసులో ఇమ్రాన్ ఖాన్‌కు పడిన మూడేళ్ల శిక్షను నిలిపేస్తూ ఇస్లామాబాద్ హైకోర్టు తీర్పునిచ్చినా ఎన్నికల సంఘం నామినేషన్లు తిరస్కరించడం గమనార్హం. దీంతోపాటు నామినేషన్లలో ఆయనను ప్రతిపాదించిన వారు సంబంధిత నియోజకవర్గా లకు చెందినవారు కాదనే అభ్యంతరాలు, ఇతర అభియో గాలు ఉన్నాయి. అయితే ఆయన సంబంధిత అభ్యంతరా లతో ఏకీభవించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులు.. ఆయన నామినేషన్లను తిరస్కరించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఇక ఇమ్రాన్ ఖాన్‌తోపాటు పలు కీలక నేతల నామినేషన్లను కూడా ఎన్నికల సంఘం తిరస్కరిం చింది. మాజీ విదేశాంగ మంత్రి షా మహ్మద్ ఖురేషీ, మరో మాజీ మంత్రి హమ్మద్ అజర్ నామినేషన్లు కూడా తిరస్కరణకు గురయ్యాయి. అయితే తిరస్కరణకు గురైన నామినేషన్లకు సంబంధించి వారు జనవరి 3 వ తేదీ లోపు అప్పీల్ చేసే అవకాశాన్ని కల్పించారు. జనవరి 10 వ తేదీలోపు అప్పీలేట్ ట్రైబ్యునల్ దీనిపై నిర్ణయం తీసుకోనుంది. ఇక ఈ ఏడాది ఫిబ్రవరి 8 వ తేదీన పాకిస్థాన్‌లో ఎన్నికలు జరగనున్నాయి.

# దూరం తగ్గి దగ్గరైపోతారు..





భార్యభర్తల మధ్య అవగాహన, సాన్నిహిత్యం అనేది చాలా మంచిది. సాన్నిహిత్యం అంటే కేవలం శారీరకంగానే కాదు చాలా విషయంలో కూడా ఉంటుంది. అవేంటో తెలుసుకోండి. కపుల్స్ మధ్య శారీరక సాన్నిహిత్యం మాత్రమే ఉంటుందనుకుంటే పొరబాటే. ఇతర కారణాలు కూడా వారిని ఒక్కటిగా చేస్తాయి. వారి మనసులని కలుపుతాయి. అవేంటో.. పూర్తి వివరాలు తెలుసుకోండి. విజ్ఞాన సంబంధమైనవి.. ఇటీవలి కాలంలో యూత్‌లో మేధో సాన్నిహిత్యం పెరుగుతుందని చెప్పొచ్చు. ఈ విధంగా తెలివితేటలతో వ్యవహరించినప్పుడు అవి వేటికి సంబంధించినా ఇద్దరు ఒకరితో మరొకరు డిస్కస్ చేయడంతో వారి మధ్య ఓ అవగాహన కుదిరి దగ్గరవుతారు. నేర్చుకోవడం.. ఆడవారు, మగవారు ఇద్దరూ కూడా కొత్త విషయాలను నేర్చుకోవడానికి ఆసక్తి చూపిస్తారు. ఇది ఇద్దరినీ దగ్గర చేయడంలో హెల్ప్ చేస్తుంది. ఇద్దరికీ కొత్త ప్లేసెస్‌కి వెళ్లడం, కొన్ని డేర్ స్టెప్స్ చేయడానికి కార్యకలాపాలు ఇంట్రెస్ట్ చూపిస్తారు. ఆ ప్రయత్నంలో వారు చాలా క్లోజ్ అవుతారు. ఎంజాయ్ చేయడం.. రిలేషన్ షిప్ విషయంలో వినోదం, సాహసాలు చేయడంలో కూడా దంపతులు ఇంట్రెస్ట్ చూపిస్తారు. ఇలాంటి పనులు చేయడం వల్ల కూడా వారి మధ్య అనుబంధం పెరుగుతుంది. కాబట్టి, ఇద్దరు కలిసి హ్యాపీ టైమ్ ఎంజాయ్ చేయొచ్చు. క్రియేటివిటీ.. క్రియేటివిటీ కూడా మనసులని, మనుషులని దగ్గర చేయడంలో హెల్ప్ చేస్తుంది. అందుకే భార్యాభర్తలు ఇద్దరు కలిసి ఈ పనులు చేయొచ్చు. ఇద్దరు కలిసి పెయింట్స్ వేయడం, బొమ్మలు గీయడం, మ్యూజిక్ ఇలా ఏదైనా ఇష్టమైన హాబీతో ఇద్దరు ఏకమవుతారు. సో.. దగ్గరవ్వాలని భావించే కపుల్స్ వీటిన్నింటిని ఫాలో అయి మీ రిలేషన్‌ని మరింత స్ట్రాంగ్ చేయొచ్చు.

# మీ ఆయుష్షును పెంచే.. హిమాలయ ఔషధాలు

హిమాలయాలు.. భూతల స్వర్గం. వెండికొండల్లా కన్పించే హిమాలయాల్ని ఎంతసేపు చూసినా తనివి తీరదు ప్రకృతి ప్రేమికులకు. ఆ కొండల నడుమ కొలువైన మంచులింగాన్ని కళ్లారా చూడాలనో, మానస సరోవరాన్ని సందర్శించాలనో కలలు కంటుంటారు కోట్లమంది. హిమాలయాలు.. ప్రకృతి ధామమే కాదు.. ఔషధ మూలికల ఆలవాలం. శతాబ్దాలుగా, స్థానిక కమ్యూనిటీలు ఈ మూలికలపై ఆధారపడి ఉన్నాయి. ఈ మూలికలు.. అనారోగ్యల చికిత్సకు ఉపయోగపడటమే కాదు.. మన ఆయుష్షును పెంచే శక్తి ఈ మూలికలకు ఉంది. మన ఆరోగ్యాన్ని రక్షించి, దీర్ఘాయువును ప్రసాధించే మూలికలు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.

అశ్వగంధ.. భారతీయ జిన్‌సెంగ్‌గా పిలిచే అశ్వగంధను వేల సంవత్సరాల నుంచీ ఆయుర్వేదంలో వాడుతున్నారు. హార్మోన్ల అసమతౌల్యంతో తలెత్తే మధుమేహ సమస్యల్నీ ఇది నిరోధిస్తుంది. కాబట్టి పీసీఓడీ, ఇతరత్రా నెలసరి సమస్యలతో బాధపడేవాళ్లకి ఇది ఎంతో మేలు చేస్తుంది. అశ్వగంధ వల్ల ఆందోళన, ఒత్తిడి వంటివి తగ్గుతాయనీ తద్వారా ఫుడ్ క్రేవింగ్ కూడా తగ్గడంతో బరువు అదుపులో ఉంటుందనీ తాజా పరిశోధనలూ చెబుతున్నాయి. నిద్రలేమినీ కీళ్లనొప్పుల్నీ తగ్గించే గుణం కూడా దీనికి ఉంది. శతావరిని ఆస్పరాగస్ అనీ అంటారు. దీనిలో ఎ, సి, కె, బి6 విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. క్రోమియం అనే ఖనిజం రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా అడ్డుకుంటుంది. రుటిన్ అనే పదార్థం పేగులకు మంచి చేస్తుంది. అండాల్లో ఈస్ట్రోజెన్ ఉత్పత్తికి సాయంచేస్తుంది. పురుషుల్లో వీర్యకణాల ఉత్పత్తికి తోడ్పడుతుంది. తల్లి పాలివ్వడంలో ముఖ్యమైన ప్రొలాక్టిన్ ఉత్పత్తిని పెంచడానికి ఇది సహాయపడుతుంది. శతావరి పొడిని తేనె, పాలతే కలిపి తీసుకోవచ్చు.



గుగ్గిలం.. గుగ్గుల్ అనేది ముకుల్ మిర్రర్ చెట్టు నుంచి వచ్చే.. జగురు పదార్థం. దీనిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటా యి. ఇది కొలెస్ట్రాల్ కరిగిం చడానికి ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. మీరు ఉదయాన్నే గోరువెచ్చని నీటితో పావు స్పూన్ గుగ్గిలం వేసుకుని తాగితే మేలు జరుగుతుంది.

శిలాజిత్.. షిలాజిత్ అనేది హిమాలయ పర్వతాలలో కనిపించే ఒక జిగట రెసిన్. దీనిలో మినరల్స్, ఫుల్విక్ యాసిడ్ ఉంటుంది. ఇది శక్తి స్థాయిలను పెంచుతుందని, రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది, దీర్ఘాయువును ప్రోత్సహిస్తుందని నమ్ముతారు. శిలాజిత్ నీటిలో వేసుకుని తాగొచ్చు.

బ్రహ్మి.. బ్రహ్మి.. అభిజ్ఞా పనితీరును మెరుగుపరుస్తుంది. మెదడు పనితీరును ప్రోత్సహిస్తుంది, ఒత్తిడిని తగ్గిస్తుంది. తద్వారా దీర్ఘాయువును ప్రసాదిస్తుంది. గోరువెచ్చని నీటిలో బ్రాహ్మి ఆకుల కషాయాలను తయారు చేసి ఉదయం పూట త్రాగాలి. తులసి..

తులసి ఆకుల్ని నోట్లో వేసుకొని నమలటం వల్ల జలుబు, ఫ్లూలు దరిచేరవు. ఇవి శరీరంలో చక్కెర స్థాయిల్ని తగ్గించగలవు. తులసి ఆకులు తరచు తీసుకుంటే.. హైపర్‌టెన్షన్ కంట్రోల్‌లో ఉంటుంది. తులసి ఆకులకు శరీరంలో కొవ్వు పెరగకుండా అడ్డుకునే శక్తి ఉంది. తరచూ ఈ ఆకుల్ని మజ్జిగలో కలిపి తాగుతుంటే.. బరువు తగ్గుతారు.

తిప్పతీగ.. తిప్పతీగను.. గిలోయ్ అనీ అంటారు. అంటే- వృద్ధాప్యాన్ని నిరోధించే అమృతం అని అర్థమట. ఈ మొక్క కాండంలోని ఫైటోకెమికల్స్ ఇన్‌ఫ్లమేషన్‌ను అడ్డుకుంటాయనీ తద్వారా కీళ్లవాపుల్ని నివారిస్తాయనీ అధ్యయనాలు పేర్కొన్నాయి. గోరువెచ్చని పాలల్లో పావు లేదా అరటీస్పూను తిప్పతీగ పొడి వేసుకుని తాగితే కీళ్లనొప్పులు తగ్గుతాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు శరీరంలోని మలినాలను తొలగించి మూత్రపిండాలు పాడవకుండా చేస్తాయి.











# చుండ్రు సమస్య దూరం అవుతుంది..!

శీతాకాలం చుండ్రు సమస్య ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా శీతాకాలంలో జుట్టు విషయంలో ఎక్కువగా వేధించే సమస్య చుండ్రు. శీతాకాలం చలిగాలుల కారణంగా.. చర్మం మాదిరిగానే కుదుళ్ల భాగం కూడా పొడిగా తయారవుతుంది. దీంతో చుండ్రు సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. దీని కారణంగా జుట్టు రాలిపోవడం మాత్రమే కాదు తలలో దురద, ముఖంపై చిన్న చిన్న మొటిమలు కూడా వస్తుంటాయి. చలికాలం వేధించే.. చుండ్రు సమస్యకు చెక్ పెట్టడానికి కొన్ని హెయిర్ ప్యాక్స్ సహాయపడతాయి.



మెంతి, మందారం ప్యాక్.. చుండ్రుకి కారణమయ్యే ఫంగస్‌ని తగ్గించడానికి మెంతులు ఎఫెక్టివ్‌గా పనిచేస్తాయి. మెంతులలోని బయోటిన్, విటమిన్ ఎ, బి, సిలు జుట్టుని ఆరోగ్యంగా ఉంచుతాయి. అలానే, మందారంలోని యాస్ట్రిజెంట్ లక్షణాలు జిడ్డు తత్వాన్ని, దురదను తగ్గించి చుండ్రు సమస్యకు చెక్ పెడతాయి. ఇందుకోసం మెంతి గింజల్ని రాత్రంతా నానబెట్టి మర్నాడు గుప్పెడు మందారాకులు చేర్చి మెత్తగా నూరుకోవాలి. ఈ మిశ్రమాన్ని మాడు నుంచి కురుల చివర్ల వరకు రాసి ఆరాక గాఢత తక్కువ ఉండే షాంపూతో తలస్నానం చేయండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే.. చుండ్ర సమస్య దూరం అవుతుంది.

పెరుగు - కలబంద.. కప్పు కలబంద గుజ్జులో రెండు చెంచాల పెరుగు, అరచెక్క నిమ్మరసం కలిపి తలకు రాయాలి. ఇలా అరగంట ఉంచి తలస్నానం చేయండి. పెరుగులో ఉండే లాక్టిక్‌యాసిడ్, ప్రోబయాటిక్స్ కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. కలబందలో హీలింగ్ ప్రాపర్టీస్, యాంటీబ్యాక్టీరియల్, యాంటీమైక్రోబియల్ గుణాలు.. చుండ్రు సమస్యకు చెక్ పెడతాయి.

పెరుగు, నిమ్మరసం.. చుండ్రు సమస్యకు చెక్ పెట్టడానికి.. పెరుగు, నిమ్మరసం ఎఫెక్టివ్‌గా పనిచేస్తాయి. ఇందుకోసం నాలుగు టేబుల్‌స్పూన్ల హెన్నా పొడిలో రెండు టేబుల్‌స్పూన్ల నిమ్మరసం వేసి కలపాలి. అప్పై ఆ మిశ్రమంలో పెరుగు వేస్తూ పేస్ట్ అయ్యేంత వరకు ఉండలు లేకుండా మృదువుగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు అప్లై చేసుకొని అరగంట పాటు ఉంచుకోవాలి. ఇప్పుడు గాఢత తక్కువగా షాంపూతో తలస్నానం చేయండి. ఇలా వారానికి ఒకసారి చేస్తే.. చుండ్రు సమస్య దూరం అవుతుంది.



గుడ్డులోని తెల్లసొన జుట్టుకు పోషణ అందిస్తుంది. ఇది చుండ్రు సమస్యకు చెక్ పెడుతుంది. మూడు టేబుల్‌స్పూన్ల హెన్నా పొడి, టేబుల్‌స్పూన్ ఆలివ్ నూనె, రెండు టేబుల్‌స్పూన్ల బాగా బీట్ చేసిన గుడ్డు తెల్లసొన.. ఈ మూడింటినీ ఒక బౌల్‌లో తీసుకొని కొద్దికొద్దిగా నీళ్లు కలుపుతూ మృదువైన పేస్ట్‌లా తయారుచేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు అప్లై చేసి 45 నిమిషాల పాటు ఉంచుకోవాలి. ఆపై గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేస్తే క్రమంగా చుండ్రు సమస్య దూరం అవుతుంది.

# బరువు తగ్గడంతో పాటు సమస్యలు దూరం..



యాలకులు.. మంది కూరలు, మసాలాల్లో వాడతారు. వీటిని వాడడం వల్ల చాలా లాభాలు ఉన్నాయి. మనం తినే ఫుడ్‌కి మంచి రుచి, వాసన వచ్చేందుకు యాలకులు వాడతాం. ముఖ్యంగా స్వీట్స్ చేసేటప్పుడు వీటిని వాడతారు. ఇవి మాత్రమే కాదు.యాలకుల టీ, గరం మసాలా తయారు చేసినప్పుడు యాలకులు వాడతారు. ఈ యాలకులని ఆహారంలో రుచి పెరగడమే కాకుండా నాణ్యత కూడా పెరుగుతుంది. దీంతో పాటు కొన్ని లాభాలు కూడా ఉన్నాయి. అవేంటో తెలుసుకోండి. నిద్ర సమస్యలు.. చాలా కారణాల వల్ల కొంతమందికి నిద్రపట్టదు. నిద్రలేక పోవడం వల్ల ఊబకాయంతో పాటు, ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయి. ఇలాంటి సమస్యల్ని దూరం చేసేందుకు యాలకులు బాగా పనిచేస్తాయి. అందుకోసం యాలకులు మరిగించిన నీటిని తాగితే నిద్రలేమి సమస్యలు దూరం చేసి ఆందోళనని, టెన్షన్‌ని తగ్గిస్తుంది.

గ్యాస్ సమస్యలు.. కొందరికీ జీర్ణ సమస్యలు వస్తాయి. మీరు గుండెల్లో మంట, గ్యాస్ సమస్యలతో బాధపడుతుంటే యాలకులని తినొచ్చు. దీనికోసం యాలకుల నీరు త్రాగడం, యాలకులని నమిలి ఆ రసాన్ని తినండి. దీని వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. బరువు తగ్గడం.. అధిక బరువు తగ్గాలనుకునేవారు మంచి రిజల్ట్స్ కోసం యాలకులని వాడొచ్చు. వీటిని నీటిలో వేసి మరిగించి తాగొచ్చు. దీని వల్ల అదనపు కొవ్వుని కరిగిస్తుంది. బరువు తగ్గేందుకు ఓ గ్లాసు నీటిలో రెండు యాలకులు వేసి రాత్రంతా నానబెట్టాలి. ఆ తర్వాత మరుసటి రోజు పరగడపున తాగితే బరువు తగ్గడం ఈజీ అవుతుంది. రక్త ప్రసరణ.. కొందరు టీ చేసేటప్పుడు యాలకు వాడతారు. టీ మరిగేటప్పుడు యాలకులు వేయాలి. దీని వల్ల ఈ టీ తాగితే రక్త ప్రసరణ పెరుగుతుంది. మన శరీరంలోకి రక్తం సరిగ్గా ప్రసరణ జరిగితేనే శరీర పనితీరు సక్రమంగా జరుగుతుంది. రక్తం సరిగ్గా ప్రవహిస్తేనే రక్తనాళల్లో అడ్డంకులు లేకుండా ప్రవహిస్తుంది. ఇది గుండెపోటు, స్ట్రోక్ వంటి ఆరోగ్య సమస్యల్ని తగ్గిస్తుంది. మూత్ర సమస్యలు.. మూత్ర వసర్జన సరిగ్గా లేకపోతే అది ఆరోగ్యంపై ఎక్కువగా ఎఫెక్ట్ చూపిస్తుంది. ముఖ్యంగా కిడ్నీల ఆరోగ్యంపై. కొన్నిసార్లు మూత్రాన్ని ఆపుకుంటారు. దీనివల్ల కొన్ని సమస్యలు వస్తాయి. కిడ్నీల్లో రాళ్ళ వంటి సమస్య ఉంటే కూడా మూత్ర విసర్జన సరిగ్గా జరగదు. ఈ సమస్య దూరమవ్వాలంటే యాలకులు తినాలి. దీని వల్ల మూత్రంలో చీము వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయి.







# మీ గుండె, లివర్ ఆరోగ్యంగా ఉంటాయ్..!









పంపర పనస.. బత్తాయిలకు అన్నయ్యాల్లా ఉంటాయ్. ఈ పండ్లలో పోషకాలు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి డైట్‌లో చేర్చుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఈ పండు తింటే.. మీ గుండె, లివర్ ఆరోగ్యంగా ఉంటాయ్..! పంపర పనస.. చూడటానికి బత్తాయి, నారింజకాయల్లా ఉంటుంది. కానీ దీని సైజ్ వాటితో పోలిస్తే పెద్దగా ఉంటుంది. మన తెలుగు రాష్ట్రాల్లో ఈ పండ్లు ఎక్కువగా లభిస్తాయి, అదీ సీతాకాలంలో ఇవి విరివిగా కనిపిస్తాయి. పంపర పనసలో దానిమ్మ గింజల రంగు, తెల్లని తొనలు కూడా ఉంటాయి. దీని ముత్యాలు.. తీయగా, పుల్లగా ఉండి టేస్ట్‌గా ఉంటాయి. ఈ పండులో పోషకాలు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇందులో విటమిన్6, విటమిన్, విటమిన్, విటమిన్ సి, పొటాషియం, మెగ్నీషియం, ఫైబర్ వంటి పోషకాల పోషకాలు మెండుగా ఉంటాయి. వ్యవస్థాపకురాలు ఎండోలిస్టిక్ న్యూట్రిషనిస్ట్ ప్రియాంషీ భట్నాగర్ పంపర పనస ఆరోగ్య ప్రయోజనాల గురించి మనకు వివరించారు.

విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది.. పంపర పనసలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఒక పండు పంపర పనసలో రోజవారీ మనకు అవసరమైన విటమిన్ సి ఉంటుంది. గాయాలు త్వరగా మానడానికి, రోగనిరోధక శక్తి పెరగడానికి, విరిగిన ఎముకలు త్వరగా అతుక్కోవడానికి విటమిన్ సి ఉపయోగపడుతుంది. కణాంతరాల్లో కొల్లాజెన్ ఏర్పడటానికి దోహదపడుతుంది. దంతాలలో డెంటిన్ అనే పదార్థం ఏర్పడటానికి సహాయపడుతుంది. విటమిన్ సి మానసిక స్థితినీ మెరుగు పరుస్తుంది. హుషారు, ఉత్సాహాన్ని కలిగిస్తుంది. విటమిన్ సి మెదడులో నాడీసమాచార వాహికల ఉత్పత్తికి తోడ్పడుతుంది.?%ంఎజూశ్రీప్తఎతీశీఱంఱంఎ ంఎఎజూ-ౕశీఎం%: పెద్దవారికి థైరాయిడ్ ఉంటే.. ఈ లక్షణాలు కనిపిస్తాయ్..!

గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.. పంపర పనసలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. పొటాషియం రక్తపోటును కంట్రోల్ ఉంచడానికి సహాయపడుతుంది. ఇది గుండె పనితీరును మెరుగుపరుస్తుంది, గుండె సమస్యల ముప్పును తగ్గిస్తుంది. పొటాషియం చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను కూడా తగ్గిస్తుంది. తద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

బరువు తగ్గుతారు.. పంపర పనసలో కేలరీలు తక్కువగా ఉంటాయి, ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఫైబర్ మిమ్మల్ని ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది. తద్వారా చిరుతిండ్లు ఎక్కువగా తినకుండా నియంత్రిస్తుంది. పంపర పనస బ్లడ్ షుగర్ లెవల్స్‌ను కూడా కంట్రోల్‌లో ఉంచుతుంది.

జీర్ణక్రియకు మేలు చేస్తుంది.. పంపర పనసలో.. ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం సమస్యను నివారిస్తుంది. ఫైబర్ పేగు కదలికలను ప్రోత్సహిస్తుంది, ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను ప్రోత్సహిస్తుంది.

లివర్ ఆరోగ్యానికి మంచిది.. పంపర పనస పండులో.. విటమిన్‌సి, నరింగెనిన్, నారింగిన్, లైకోపీన్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఈ పండులో ఉండే యాంటీఆక్సిడెంట్లు... లివర్ పనితీరును మెరుగుపరు స్తాయి. ఇవి లివర్‌ని డీటాక్స్ చేయడానికి, శరీరం నుంచి వ్యర్థాలు, టాక్సిన్స్‌ను తొలగిస్తుంది. పంపర పనసలో సమృద్ధిగా ఉండే.. విటమిన్ సి గాయాలు మానడానికి తోడ్పడుతుంది. విటమిన్ సి కొల్లాజెన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. అదనంగా, ఈ పండులో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఇన్ఫెక్షన్లను నివారించడానికి తోడ్పడతాయి.

# యాక్షన్ డ్రామా



తెలుగు, తమిళం చిత్రాలతో మంచి గుర్తింపు పొందిన యంగ్ హీరో సందీప్ కిషన్ మరో ఆసక్తికర ప్రాజెక్ట్‌తో ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. 'స్నేహగీతం', 'ప్రస్థానం' వంటి చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరైన ఆయన, విభిన్న కథలను ఎంచుకునే నటుడిగా పేరుపొందారు. కెరీర్ ప్రారంభంలో దర్శకుడు గౌతమ్ మీనన్ తెరకెక్కించిన 'వారణం ఆయిరం' చిత్రానికి సహాయ దర్శకుడిగా పనిచేసిన సందీప్, తర్వాత హీరోగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. చెన్నైలో జన్మించిన ఆయన లయోలా కాలేజీలో చదువు పూర్తి చేసి సినీరంగంలో అడుగుపెట్టారు. ప్రముఖ ఛాయాగ్రాహకులు ఛోటా కె.నాయుడు, శ్యామ్ కె.నాయుడు ఆయన బంధువులు కావడం విశేషం. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, తెనాలి రామకృష్ణ బీఎ బీఎల్ వంటి చిత్రాలతో మంచి హిట్లు అందుకున్న సందీప్ కిషన్ ఇటీవల ప్రేక్షకుల్ని పెద్దగా ఆకట్టుకోలేకపోతున్నాడు.

ఇటీవల ఆయన సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరచడంతో మార్కెట్ కొంత తగ్గిందనే ట్రేడ్ వర్గాలు చెబుతున్నా కథల ఎంపికలో కొత్తదనం కోసం మాత్రం ప్రయత్నిస్తూనే ఉన్నాడు. మంచి కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్న సందీప్... టాలెంటెడ్ దర్శకుడు కృష్ణ చైతన్య దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం "పవర్ పేట"లో నటిస్తుండటం సినీ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. 'రౌడీ ఫెలో', 'చల్ మోహన్ రంగ', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' వంటి చిత్రాలతో తనదైన ముద్ర వేసిన కృష్ణ చైతన్య ఈ ప్రాజెక్ట్‌ను తన కెరీర్‌లో కీలక చిత్రంగా భావిస్తున్నారు. కంటెంట్ బలంగా ఉండే కథలతో ప్రేక్షకులను ఆకట్టుకునే దర్శకుడిగా ఆయనకు ఉన్న పేరుతో ఈ సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి.

నమ్ముతోంది. మరోవైపు సందీప్ ఇప్పటికే విజయ్ కుమారుడు జాసన్ విజయ్‌తో కలిసి 'సిగ్మా' చిత్రంలో నటిస్తుండగా, ఆ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. "పవర్ పేట" కథ విషయానికి వస్తే... ఒక సాధారణ వ్యక్తి ఎలా అసాధారణ శక్తిగా ఎదిగి, ఒక ప్రాంతాన్ని ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నాడనే నేపథ్యంతో సినిమా సాగుతుందని సమాచారం. పాత్ర కోసం సందీప్ కిషన్ తన లుక్, బాడీ లాంగ్వేజ్ పూర్తిగా మార్చుకుంటున్నట్లు తెలుస్తోంది. కథలో భాగంగా ఆయన మూడు డిఫరెంట్ షేడ్స్‌లో కనిపించనున్నారని టాక్. పీరియాడికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భారీ సెట్స్, ఆర్ట్ వర్క్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విభిన్న కథతో, బలమైన మేకింగ్‌తో "పవర్ పేట" ద్వారా సందీప్ కిషన్ మరోసారి తన రేంజ్ ఏంటో బాక్సాఫీస్‌కు చూపించాలనే లక్ష్యంతో ఉన్నారని టాలీవుడ్‌లో చర్చ నడుస్తోంది. టాలీవుడ్‌లో ప్రస్తుతం పీరియాడికల్ డ్రామాల ట్రెండ్ నడుస్తున్న వేళ సందీప్ కిషన్ ఈ మూవీతో ఎలాంటి రిజల్ట్ అందుకుంటాడో చూడాలి.

# క్రేజీ మల్టీస్టారర్



మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో డైరెక్టర్ అనిల్ రావిపూడి ఇండస్ట్రీ హిట్ కొట్టారు. ఈసారి దొరుకుతాడా లేదా? అనే డిస్కషన్స్ మధ్యలో వచ్చి, మరో బ్లాక్ బస్టర్ సక్సెస్ తన ఖాతాలో వేసుకుని టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారిపోయారు. వరుసగా తొమ్మిది విజయాలు అందుకున్న దర్శకుడిగా అరుదైన ఘనత వహించారు. దీంతో ఆయన 10సినిమాపై అందరి దృష్టి పడింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అనేక వార్తలు ప్రచారంలో ఉన్న తరుణంలో, అనిల్ రావిపూడి తన కొత్త సినిమాను ప్రకటించారు.



విక్టరీ వెంకటేష్ , నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా తన నెక్స్ట్ మూవీని తెరకెక్కిస్తున్నట్లు అనిల్ రావిపూడి అధికారంగా ప్రకటించారు. వచ్చే సంక్రాంతికి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మరోసారి స్పష్టం చేశారు. "మొదటి 'వందకోట్ల బొమ్మ' కొట్టిన హీరో వెంకటేష్ గారితో.. 'మొదటిసారి బొమ్మ' తీసే అవకాశం ఇచ్చిన హీరో కళ్యాణ్ రామ్ గారితో కలిసి 2027 మొదటి పండగకి మీ, ముందుకు వస్తున్నాం" అని అనిల్ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా వెంకీ - కళ్యాణ్ రామ్‌లతో రూపొందించిన ఓ వీడియోని షేర్ చేసుకున్నారు.

'మన శంకర వరప్రసాద్ గారు' సక్సెస్ ప్రెస్ మీట్ లోనే అనిల్ రావిపూడి తన నెక్స్ట్ ప్రాజెక్ట్ గురించి మాట్లాడారు. తన పదో సినిమాకి ఐడియా క్రాక్ అయిందని, ఈసారి టైటిలే చాలా విచిత్రంగా ఉంటుందని, మళ్లీ వస్తున్నాడ్రా అని అనుకుంటారని తెలిపారు.

గత కొన్ని రోజులుగా వెంకటేశ్‌తో సినిమా ఉంటుందని, మలయాళ స్టార్ ఫాహద్ ఫాజిల్ కీ-రోల్ చేస్తున్నాడని, కీర్తి సురేశ్ కథానాయికగా చేస్తోందని, దానికి 'బామ్మర్ది బాల్ రెడ్డి' అనే టైటిల్ ఫైనల్ అయినట్లు వార్తలు వచ్చాయి. కాగా ఇన్నాళ్లు జరిగినట్లు ఫహాద్ కాకుండా ఆయన స్థానంలో కళ్యాణ్ రామ్ వచ్చినట్లు అర్థమవుతోంది. ఇక హీరోయిన్, సినిమా టైటిల్ విషయంలో క్లారిటీ రావాల్సి ఉంది. ఇదిలా ఉంటే. నందమూరి - కొణిదెల - అక్కినేని కుటుంబ హీరోలతో కలిసి నటించిన, నటిస్తున్న ఏకైక హీరోగా దగ్గుబాటి వెంకటేష్ సరికొత్త చరిత్ర సృష్టించారు.

# ఇన్‌స్పైరింగ్ జర్నీ!

సినిమా ఇండస్ట్రీలో బ్యాక్‌గ్రౌండ్ లేకుండా నిలబడటం అనేది చాలామందికి కలలా మారిపోతుంది. ప్రతిభ ఉన్నా సరైన అవకాశం దొరక్క వెనక్కి తగ్గే వారు ఎందరో. అయితే కొంతమంది మాత్రమే ఎలాగైనా కష్టపడి సాధించాలనే తపనతో ముందుకు సాగి తమ కలని నెరవేర్చుకుంటారు. అలాంటి వారిలో కోలీవుడ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ పేరు ఇప్పుడు గట్టిగా వినిపిస్తోంది. సాధారణ మధ్యతరగతి యువకుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం నేడు స్టార్ హీరో స్థాయికి చేరుకోవడం యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.



చిన్నప్పటి నుంచే సినిమాలపై ఇష్టం పెంచుకున్న ప్రదీప్, తన తండ్రి నడిపే చిన్న జిరాక్స్ షాపులో పనిచేస్తూనే అవకాశాల కోసం వెతికారు. ఖాళీ సమయాల్లో షార్ట్ ఫిల్మ్స్ తెరకెక్కిస్తూ తన ప్రతిభను మెరుగుపరుచుకున్నారు. ఇంజనీరింగ్‌లో చదువుకుంటున్న రోజుల్లోనే 2015లో 'వాట్సాప్ కాదల్' అనే లఘు చిత్రాన్ని రూపొందించి నటన, ఎడిటింగ్, దర్శకత్వం అన్నింట్లోనూ తన సామర్థ్యాన్ని చూపించారు. ఈ షార్ట్ ఫిల్మ్స్ ద్వారానే ఆయనపై సినీ ఇండస్ట్రీ దృష్టి పడింది. దాని ఫలితంగానే 2019లో 'కోమలి' చిత్రంతో దర్శకుడిగా వెండితెరపై అడుగుపెట్టారు. తొలి సినిమాతోనే ప్రేక్షకులను ఆకట్టుకుని తనదైన ముద్ర వేసుకున్నారు. ఆ సమయంలో ఆయనకు అందిన రెమ్యునరేషన్ రూ.50 లక్షలే అయినా అది ఆయనకు పెద్ద గుర్తింపునిచ్చింది. దర్శకుడిగా విజయాన్ని అందుకున్న తర్వాత తనలోని నటుడిని ప్రేక్షకులకు పరిచయం చేయాలనుకున్న ప్రదీప్ స్వీయ దర్శకత్వంలో 'లవ్ టుడే' మూవీని తెరకెక్కించారు. ఈ వరుస విజయాలతో ప్రదీప్ రంగనాథన్ యూత్‌లో మినిమమ్ గ్యారెంటీ హీరోగా గుర్తింపు తెచ్చుకున్నారు. కథల ఎంపికలో కొత్తదనం, సహజ నటన, యూత్‌ను ఆకట్టుకునే డైలాగ్స్, మేనరిజం ఆయనకి ప్రత్యేకమైన ఫాలోయింగ్ తెచ్చాయి. ముఖ్యంగా సోషల్ మీడియా తరం ఎమోషన్స్‌ని పట్టుకుని సినిమాలు చేయడంలో ఆయనకు ఉన్న పట్టు ట్రేడ్ వర్గాల్ని ఆశ్చర్యపరుస్తోంది. రెమ్యునరేషన్ పరంగా చూస్తే ఆయన ఎదుగుదల మరింత షాకింగ్‌కి గురిచేయక మానదు. తొలి సినిమా 'కోమలి'కి రూ.50 లక్షలు తీసుకున్న ప్రదీప్, 'డ్యూడ్' సమయానికి రూ.10 కోట్లకు పైగా పారితోషికం అందుకున్నట్లు సమాచారం. ఇప్పుడు ఆయన క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని బడా బ్యానర్లు ఏకంగా రూ.25 కోట్ల వరకు ఇవ్వడానికి ముందుకొస్తున్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఏడేళ్లలో ఈ స్థాయి జంప్ సాధించడం నిజంగా అరుదైన విషయమే.

ప్రస్తుతం స్టార్ దర్శకుడు విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'లో ప్రదీప్ నటిస్తున్నారు. ఇందులో ఆయనకు జోడిగా కృతి శెట్టి నటిస్తుండగా, ఎస్.జె. సూర్య కీలక పాత్రలో కనిపించనున్నారు. మార్చిలో విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయి. సాధారణ యువకుడిగా మొదలై కోట్లాది అభిమానుల మనసు గెలుచుకున్న ప్రదీప్ రంగనాథన్ ప్రయాణం... కష్టపడితే అసాధ్యం కానిదేదీ లేదని చెప్పే స్ఫూర్తిదాయక కథగా నిలుస్తోంది. ఒక బయోపిక్‌కి సరిపడా ట్విస్టులన్నీ ఆయన నిజ జీవిత కథలో కనిపిస్తున్నాయి. అన్నీ కుదిరితే అతడి జీవిత ప్రయాణం వెండితెరపై బయోపిక్‌గా వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

# కొత్త నిర్వచనం

పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి. తాజాగా విడుదల చేసిన కొత్త పోస్టర్ ఆ అంచనాలను రెట్టింపు చేస్తున్నాయి. పవన్ హ్యాట్ ధరించి స్టైలిష్ గా కనిపిస్తున్న పోస్టర్, సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. విడుదలైన క్షణాల్లోనే వైరల్‌గా మారింది. అభిమానులు, సినీ ప్రియులు పవన్ కళ్యాణ్ అద్భుతమైన లుక్ కి ఫిదా అవుతున్నారు. ఈ సినిమాకు సంబంధించి ఏ అప్డేట్ వచ్చిన చక్కని ఆదరణ లభిస్తోంది. 'దేఖ్ లేంగే సాలా', 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పాటలు చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి. అన్ని వర్గాల నుంచి వెల్లువెత్తుతున్న ప్రేమాభిమానాలతో చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేస్తోంది. ఈ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ, త్వరలోనే చిత్రానికి సంబంధించిన పవర్‌ప్యాక్డ్ 40 సెకన్ల గ్లింప్స్‌ను విడు దల చేయడానికి నిర్మాతలు సిద్ధమవు తున్నారు. దీనితో మాస్ ఎలిమెంట్స్‌ను ప్రేక్షకు లకు చూపించనున్నారు. ఈ గ్లింప్స్ అభిమాను లకు అసలు సిసలైన మాస్ విందుని అందించ నుంది. ఉస్తాద్ భగత్ సింగ్'లో పవన్ కళ్యాణ్‌ను మునుపెన్నడూ చూడని మాస్ అవతార్‌లో చూపించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారు దర్శకుడు. అన్ని అంశాల మేళవింపుతో పూర్తి వినోదభరిత చిత్రంగా ఇది రూపుదిద్దుకుంటోంది. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ తన సంగీతంతో చిత్రానికి మరింత హై వోల్టేజ్ ఎనర్జీని అందిస్తున్నారు. అంచనాలు ఆకాశాన్ని తాకుతున్న వేళ, ఉత్సాహం రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో, 'ఉస్తాద్ భగత్ సింగ్' మరోసారి మాస్ సినిమాకు కొత్త నిర్వచనం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది' అని మేకర్స్ చెబుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.



# రజినీకాంత్ కొడుకుగా



లోకనాయకుడు కమల్‌హాసన్ నిర్మాణంలో, సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రం, కమల్ హాసన్ స్వంత బ్యానర్ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌పై రూపొందనుంది. దశాబ్దాల తర్వాత తమిళ సినీ ప్రపంచంలోని ఈ ఇద్దరు దిగ్గజాలు ఒకే ప్రాజెక్ట్ కోసం చేతులు కలపడం విశేషంగా మారింది. ఇప్పటికే విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానుల్లో అంచనాలను మరింత పెంచుతోంది. "ప్రతి కుటుంబంలోనూ ఒక హీరో ఉంటాడు" అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ ప్రాజెక్ట్ ఎమోషన్స్‌తో కూడిన పవర్‌ఫుల్ ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతుందనే టాక్ వినిపిస్తోంది. తాజా ప్రచారం ప్రకారం మలయాళ సినీ రంగానికి చెందిన నటుడు-దర్శకుడు బసిల్ జోసెఫ్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని తెలుస్తోంది.


రజనీకాంత్‌కు కుమారుడి పాత్రలో ఆయన కనిపించనున్నారనే వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అదే సమయంలో మరో కీలక పాత్ర కోసం ప్రియాంక అరుళ్ మోహన్ పేరును కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ విషయాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

బసిల్ జోసెఫ్ విషయానికి వస్తే, ఆయన కేవలం దర్శకుడిగానే కాదు, ప్రతిభావంతమైన నటుడిగానూ మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. 2013లో సహాయ దర్శకుడిగా సినీ ప్రయాణం ప్రారంభించిన బసిల్, తరువాత కుంజిరామాయణం, గోధా, మిన్నల్ మురళి వంటి చిత్రాలతో దర్శకుడిగా తన ప్రత్యేక ముద్ర వేశారు. ముఖ్యంగా 'మిన్నల్ మురళి' విజయంతో ఆయన పేరు దేశవ్యాప్తంగా వినిపించింది.
నటుడిగా కూడా జోజి, జాన్.ఇ.మ్యాన్, జయ జయ జయ జయ హే, పల్తు జాన్వర్, ఫలిమి వంటి సినిమాల్లో సహజమైన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల తమిళ చిత్రం 'పరాశక్తి' క్లైమాక్స్‌లో ఆర్మీ ఆఫీసర్‌గా తళుక్కుమన్నారు. విభిన్న పాత్రలను ఎంచుకుంటూ తన క్రేజ్‌ను మరింత పెంచుకుంటున్న బాసిల్, ఇప్పుడు రజనీకాంత్‌తో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం దక్కితే అది ఆయన కెరీర్‌లో కీలక మలుపు అవుతుందనే చెప్పాలి. మొత్తానికి 'రజనీ 173'పై రోజురోజుకీ పెరుగుతున్న అంచనాల మధ్య, నటీనటుల ఎంపికపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# అదరగొట్టాడుగా..

స్టార్ హీరోగా కోట్లాది అభిమానులను సంపాదించిన జూ. ఎన్టీఆర్ వ్యక్తిగత జీవితాన్ని మాత్రం చాలా గోప్యంగా ఉంచుతారు. కుటుంబానికి సంబంధించిన విషయాలు అంతగా బయటకు రానివ్వరు. కాకనోతే ఫంక్షన్లు, విహార యాత్రలకు వచ్చి పోయే సందర్భాల్లో వారి ఫొటోలు, వీడియోలు బయటకు వచ్చి కొద్ది రోజుల పాటు సోషల్ మీడియాల్లో హడావుడి చేస్తుంటాయి. అభిమానులు ఊడా వాటిని అపురూపంగా పరిగణిస్తూ వాటిని ఇతరులతో పంచుకుంటుంటారు. ఎన్టీఆర్‌కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు అభయ్ రామ్ (11) , చిన్న కుమారుడు భార్గవ్ రామ్ (7) ఇద్దరూ హైదరాబాద్ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ లో విద్యాభ్యాసం చేస్తున్నారని తెలిసింది. కాగా ఇటీవల వీరికి సంబంధించిన ఓ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. స్కూల్‌లో నిర్వహించిన డ్రాయింగ్ పోటీలో భార్గవ్ రామ్ పాల్గొనగా తన చేతిలో అప్పుడే వేసిన ఏనుగు పెయింటింగ్‌ను పట్టుకుని నిలబడ్డాడు. ఈ ఫొటో కాస్త బయటకు రావడంతో ఫ్యాన్స్ ఆ ఫొటోను తెగ వైరల్ చేస్తున్నారు. భార్గవ్ రామ్ డ్రాయింగ్‌కు అభినందనలు తెలుపుతున్నారు.






Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.